
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024



సోమశిలకు 20,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 20,892 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.83 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 500 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు : పల్లకీలో ఊరేగుతున్న శివపార్వతులు

శంభో శివశంభో..

- వైభవంగా కార్తీక మాసం ప్రారంభం
- కనుల పండువగా ఆకాశదీప ఆవిష్కరణ

జిల్లావ్యాప్తంగా శివ, వైష్ణవ ఆలయాల్లో శనివారం రాత్రి కార్తీక మాసం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేష పూజలు, స్వామివార్లకు పల్లకీసేవలు, భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఆకాశదీపాలు వెలిగించారు. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకరణ, శివపార్వతులకు విశేష పల్లకీ ఉత్సవం, తదితర పూజలు జరిగాయి. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఈవో జె.శ్రీనివాసరావు తదితరులు ఆకాశ దీపాన్ని వెలిగించి ధ్వజస్తంభానికి కట్టి, అధిరోహించారు. అలాగే వేణుగోపాలస్వామి, ఇరుకళల పరమేశ్వరి, అష్టలక్ష్మి, రాజరాజేశ్వరి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లోనూ ధ్వజస్తంభానికి విశేష పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ కార్తీక మాసం ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపాన్ని ఎగరవేస్తున్న అర్చకులు

నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు షురూ!

- 20న నోటిఫికేషన్ విడుదల
- 21 నుంచి మూడు రోజులపాటు ఎన్నికలు
- పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం

6

అమాత్యా ఆలకించు!

- సంక్షేమం ఓకే.. సాగునీటితోనే బెంగ
- పడకేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులెన్నో!
- ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే జిల్లా సస్యశ్యామలమే!
- నేటి మధ్యాహ్నం డీఆర్సీ సమావేశం

అభివృద్ధికి నోచని నీటివనరులు.. సంవత్సరాలు గడుస్తున్నా వెక్కిరిస్తున్న శిలాఫలకాలు... అర్ధంతరంగా ఆగిన పనులు.. మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు.. ఇలా చెప్పుకుంటేపోతే చాలానే ఉన్నాయి. జిల్లాలో ఎన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర రాజధానికి యంత్రాంగం పంపిన ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోయాయి. అంచనాలు పెరిగిపోతున్నాయే తప్ప పనులకు ఆమోదం లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల తర్వాత తొలిసారి జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం ఆదివారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిదులు, ఉన్నత యంత్రాంగం ఈ సమావేశంలో పాల్గొననుంది. జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై అమాత్యులు చర్చించి, కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సింహపురివాసులు కోరుతున్నారు.





సోమశిల జలాశయం దిగువున దుస్థితి

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఐదు నెలల కూటమి పాలనకు ప్రజలు మంచి మార్కులే వేస్తున్నారు. శాంతి భద్రతల నుంచి సంక్షేమ పథకాల వరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నా క్యాంటీన్లతో పేదల ఆకలి తీర్చారు. ఉచిత ఇసుక పంపిణీ విధానంతో ఇటు కూలీలు, అటు భవన నిర్మాణదారుల కన్నీళ్లు తుడిచారు. తాజాగా మహాశక్తి దీపం-2 పథకం కింద పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ ఒక్క పథకం ద్వారా జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయల భారం పడినా సంక్షేమం విషయంలో ఎన్డీఏ కూటమి వెనక్కు తగ్గదు. ఈ ఐదు నెలల స్వల్ప కాలంలో విజయవాడ ఉప్పెన వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా వాటిని తట్టుకుంటూనే సంక్షేమాన్ని అమలు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లపాటు నరకాలకు ఆనవాళ్లుగా కనిపించిన రోడ్లను బాగు చేసే పనులు మొదలు పెట్టారు. ప్రజల తక్షణ మౌలిక అవసరాలను గుర్తించి ఆ పనుల ఆరంభానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని విషయాల్లో ప్రగతి కనిపిస్తున్నా.. ఇంకా ఏదో వెలితి ఉంటూనే ఉంది. ఇరిగేషన్ పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయంలో లోటు కనిపిస్తూనే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు తొలి జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పాలకులు జిల్లాలో దశాబ్దాల కాలంగా నత్తనడక నడుస్తున్న ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నిర్ణయాలు తీసుకుంటే, ఆ మేరకు పనులను పరుగులు తీయిస్తే ఇక జిల్లా సస్యశ్యామలమే అవుతుంది. కూటమి ప్రజాప్రతినిధుల మీద కొండంత విశ్వాసంతో తమ ప్రాంతాల్లోని ఇరిగేషన్ సమస్యలను సమీక్ష మండలి ముందుకు తీసుకొస్తున్నారు

- సోమశిల జలాశయం ఉత్తర కాలువ సామర్థ్యం 750 నుంచి 1500 క్యూసెక్కులకు పెంచే పనుల్లో వేగం పెంచాలి.
- సోమశిల జలాశయం ఇరుపక్కల దారుణంగా దెబ్బతిన్న పొర్లుకట్టలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలి.
- సోమశిల క్రస్టుగేట్ల మరమ్మతులకు రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆ నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలి.
- కామారెడ్డిపాడు, పాతాళపల్లి వద్ద ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. వెంటనే వీటికి మరమ్మతులు చేయాలి.
- సోమశిల జలాశయం వద్ద తాగునీటి పథకం మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దానిని వినియోగంలోకి తేవాలి.
- సంగం బ్యారేజీలో ఐదు శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఘాట్లు, లైనింగ్, రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయాలి.
- సంగం బ్యారేజీ పరిధిలోని ప్రధాన పంట కాలువలన్నీ పూడికతో నిండి ఉన్నాయి. చెరువుల కట్టలూ బలహీనంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలి.
- పెన్నా, సంగం బ్యారేజీల నిర్వహణకు సిబ్బంది లేరు. గేట్లు ఎత్తే దిక్కు కూడా లేదు. తక్షణం వీరిని నియమించకుంటే ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉంది.
- కందుకూరు నియోజకవర్గంలో వీఆర్‌కోట ఆనకట్ట పనులు రెండేళ్లుగా నత్తనడక సాగుతున్నాయి. అంచనాలు పదిరెట్లు పెరిగాయి కానీ పనులు పూర్తి కాలేదు.
- రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపునకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఒకటిన్నర దశాబ్దం అవుతోంది. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- రామతీర్థం జలాలతో తాగునీటి పథకం మంజూరైనా టెండర్ల దశలో ఆగిపోయింది. కందుకూరు బైపాస్‌రోడ్డుకు అతీగతీ లేకుండా పోయింది.
- పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హై లెవల్ కెనాల్ పనులు దశాబ్దాల తరబడి నత్తనడక సాగుతుండటంతో సాగు, తాగునీటి సమస్య తీవ్రమైంది.
- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులు, గుట్టలను కొల్లగొట్టారే కానీ చిన్న మరమ్మతులు చేసిన పాపాన పోలేదు.
- దగదర్తి విమానాశ్రయం పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని వెంటనే పూర్తి చేసి మత్స్యకారులకు మేలు చేయాలి.
- బిట్రగుంటలో వేలాది ఎకరాల రైల్వే ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు తెస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది.
- వైసీపీ నేతల పాపాల కారణంగా కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ వెళ్లిపోయింది. వేలాది మంది ఉద్యోగులను వీధిన పడేసింది. తక్షణం దీని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.
- సర్వేపల్లి రిజర్వాయర్ విస్తరణ పనులు టెండర్ల దశలోనే ఉన్నాయి. ఐదేళ్లుగా డేగపూడి-బండేపల్లి కాలువ పనులు ఆగిపోయాయి.



ఉదయగిరి రూరల్ : అసంపూర్తిగా మిగిలిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కట్ట రివిట్‌మెంట్ పనులు



'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం

ఇక రహదారులపై గుంతలుండవ్!

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

మూముడూరులో మంత్రి ఆనం వెల్లడి

చేజర్ల, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి) : గత ప్రభుత్వం విస్మరించిన అన్ని రహదారులకు మరమ్మతులు చేపట్టి రోడ్లపై గుంతలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మాముడూరు గ్రామంలో 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆనం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో ధ్వంసం చేసిన రోడ్లను మనకు ఆస్తిగా ఇచ్చిందని దుయ్యబట్టారు. ఆత్మకూరులో గత పదేళ్లుగా ఎమ్మెల్యేగా పని చేసిన వాళ్ళు ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.3.47 కోట్లతో 15 ఆర్‌అండ్‌బీ రోడ్లను మొదలుపెట్టామని, త్వరలో మరో 30 కోట్లతో అధికారులు పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. మార్చి 31వ తేదీలోపు

- మిగతా 6లో



నెల్లూరులో అబ్బురపరిచిన యోగా పోటీలు

ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ కనుమరుగు

రిజిస్ట్రేషన్లకు వ్యాధిగ్రస్థులు, వయోవృద్ధుల అవస్థలు

- వివరాలు 7లో

ఉత్సాహం..ఉత్తేజం

అది శరీరమా లేదా రబ్బరా!? యోగాలో అన్ని భంగిమలు ఉన్నాయా!? అంతటి సాధన ఎలా చేశారు!? ఇలా ఆహూతులను ఆశ్చర్యంలో ముంచెత్తేలా యోగా విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీలు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నేటితో ముగిసే ఈ పోటీల్లో తమ విన్యాసాలను ప్రదర్శించి పతకాలు సాధించాలన్న పట్టుదలతో క్రీడాకారుల్లో పోటీపడుతున్నారు.


6




పోటీలను తిలకిస్తున్న అధికారులు

ఉత్సాహం.. ఉత్తేజం

• అబ్బురపరిచిన యోగా పోటీలు






నెల్లూరు (విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చిన్నారులు ఉత్సా హంగా...ఉత్తేజంగా పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఎవరికి వారు తాము నేర్చుకున్న యోగా విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు చేస్తున్న యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతోపాటు యోగా ప్రాముఖ్యతపై అందరినీ ఆలోచింప చేశారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీలు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమ య్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత జిల్లాల ప్రకారం 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవగా వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో బాల, బాలికలు తమ విన్యాసాలను ప్రదర్శించి పతకాలు సాధించాలన్న లక్ష్యంతో పోటీ పడుతున్నారు.

● భారతీయ సంస్కృతికి నిదర్శనం

భారతీయ సంస్కృతికి నిదర్శనంగా యోగా కీర్తి గడించిందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. యోగా పోటీల ప్రారంభోత్సవం కార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యం అందించే యోగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందు తోందన్నారు. యోగా మూలాలన్నీ భారత్‌లోనే ఉన్నాయని, వేదకాలం నుంచి భారతదేశంలోనే యోగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలతో నేడు ప్రపంచ వ్యాప్తంగా అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారంటే దాని ప్రాముఖ్యత ఏమిటో నేటితరం యువ త, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. గడిచిన దశాబ్దకాలంలో యోగా అనేక రూపాలు మారు తూ భిన్నమైన ఆసనాలతో అంతర్జాతీయస్థాయిలో కీర్తి గడిస్తోందన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన యోగాలో విద్యార్థులు నిత్య సాధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే.యతిరాజ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ కలిగిన యోగాలో విద్యార్థులు ఉత్తమంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీఈఓ ఎస్.ప్రసన్నలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్ బాషా, నెల్లూరు ఎంఈఓ తిరుపాల్, ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి కె.గురుప్రసాద్, ఏపీ పీఈటీల సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, అండర్-19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి శ్రీరేష్, అండర్-14 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.విజయ, జిల్లా పీఈటీల సంఘం కార్యదర్శి పి.థామస్‌పీటర్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, జ్యోతిర్మయి, పోటీల పరిశీలకుడు జె.రాజ్‌కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.



ఏ ప్రతిఫలాన్ని, ప్రయోజనాన్ని ఆశించకుండా కుటుంబ అవసరాలు, ఆశయాలు తీర్చేది గృహిణి మాత్రమే. ఇంటిని సరైన దారిలో నడిపించేందుకు అనునిత్యం శ్రమించే చోదకశక్తి ఆమె. తెల్లవారుజామున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు విరామం లేకుండా ఇంటిపనుల్లో నిమగ్నమై.. కుటుం బాధ్యతలు నెరవేరుస్తూ భర్తతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలు ఎందరో.. ఎందరోరెందరో ఉన్నారు. నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



సంసారంలో సంతోషం

గృహిణి వల్లే సాధ్యం !

● అన్నీ తానై ఇంటిని చక్కదిద్దుతున్న ఇల్లాలు ● కుటుంబానికి కేంద్ర బింధువు ఆమె

● ఆర్థిక వ్యవహారాల్లో చేదోడు వాదోడుగా.. ● నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

ఇంటికి దీపం ఇల్లాలు అనే మాటకు నిదర్శనంగా పనులు చేస్తూ కుటుంబ సభ్యుల అవసరాలను తీరుస్తూ, ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న గృహిణులు నేడు అనేకమంది ఉన్నారు. అలాగే ఆర్థిక లావాదేవీల్లో చేదోడువాదోడుగా తమ సేవలను అందిస్తున్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ఉందనడానికి ఎలాంటి సందేహం లేదు. ఇంట్లో తాను అందిస్తున్న సహకారం, నిరంతరం శ్రమించే తత్వమే ఇందుకు నిదర్శనం. కరోనా లాంటి మహమ్మారి సమయంలో గృహిణిలు అందించిన సేవలు అమోఘమనే చెప్పాలి. ఈ సమయంలో విద్యాసంస్థలన్నీ మూతపడడం, వర్క్ ఫ్రం హోమ్ వల్ల అందరూ ఇళ్లకే పరిమితమై పోవడంతో ప్రతి ఇంటి గృహిణి కూడా విశేషసేవలందించారు. పిల్లలకు సమయానికి భోజనం అందించడం, ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు రాకుండా పక్కా ప్రణాళికలతో ఇంటిని నడిపించారు. అన్నీ పనుల్లో తమదైన ముద్రవేసే గృహిణుల సేవలు ఎప్పటికీ ప్రత్యేకమే...అందరికీ ఆదర్శమే.

● గృహిణులను గౌరవించండి !



ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా కుటుంబంలోని సభ్యులంతా వారిని గౌరవించడంతో పాటు వారికి పూర్తి సహకారాన్ని అందించాలి. వారికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా కుటుంబంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్న వారి భావోద్వేగాలకు ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి గృహిణి కూడా తమ ఇంటిని నివాస స్థలం కాకుండా తమ కుటుంబం ఉన్నతి చెందే ప్రదేశంగా మార్చుకోవడానికి ఎంతో నిబద్ధతతో ఉంటారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కుటుంబ సభ్యులంతా వారికి అండగా ఉంటూ ప్రేమను పంచుతూ ఉండాలి.

పిల్లలను తీర్చిదిద్దా..



నేను జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బీఏ పాలిటిక్స్ చదివా. నా ఇద్దరు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు గృహిణిగానే మిగిలిపోయా. ఉద్యోగం లేదా ఏదైనా వ్యాపారం చేసే అవకాశం ఉన్నా, పిల్లలను మంచిగా చదివించేందుకు వాటిని వదులుకున్నా. పెద్దకుమార్తె కావ్యశ్రీని మెడిసిన్ చదివించా. ఆమె తమిళనాడులో జనరల్ మెడిసిన్ డాక్టర్‌గా పనిచేస్తోంది. చిన్నకుమార్తె వెంకట దీప్తిక డిగ్రీ చదువుతో ంది.గృహిణిగా పిల్లలను తీర్చదిద్దడం నాకు సంతృప్తి నిచ్చింది. కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలంటే గృహిణిగానే ఉండడమే మంచిదనేది నా అభిప్రాయం.

- మంచాల మల్లిక, వైకుంఠపురం, కావలి

గృహిణిగా జీవితంలో సంతృప్తి



బీఎస్సీ కంప్యూటర్స్ చదివా. ఉద్యోగం వేటలో ఉన్న సమ యంలో వివాహమైంది. నాకు ఇద్దరు కుమారులు. ఉద్యోగం చేసి కుటుంబానికి చేదోడుగా ఉండాలనుకున్నా. పరిస్థితుల ప్ర భావంతో గృహిణిగా స్థిరపడ్డా.దీంతో నా కుటుంబాన్ని నేనే చూసుకోవాల్సి వచ్చింది. అయినా గృహిణిగా జీవితం సంతృప్తి నిచ్చింది. ఉద్యోగం చేస్తూ ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో...? కుటుంబాన్ని, కుటుంబ సభ్యుల మంచి చెడు చూసుకుంటూ సంతృప్తికరమైన జీవితాన్ని అనుభవిస్తున్నా.

- మొలతాటి శారద, అల్లూరు

అటు గృహిణిగా.. ఇటు వ్యాపారిగా



కందుకూరులోని పెద్దబజారుకు చెందిన తటవర్తి జానీ బీకాం చదివారు. గృహిణిగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే వ్యాపారంలో తన భర్తకు చోదోడుగా ఉంటున్నారు. అంతేకాదు.. సామాజిక సేవా కార్యక్రమాల్లోను ఆమె పాల్గొంటు న్నారు. ఆలయాల్లో జరిగే నిరంతర కార్యక్రమాల్లో జానీ పాల్గొంటారు. అలాగే.. మొన్నటిదాకా కందుకూరు ఏరియా హస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా కూడా పని చేశారు. ఇష్టంగా చేస్తే ఎన్ని బాధ్యతలు నిర్వహించినా కష్టం అనిపించదని ఆమె చెప్పుకొచ్చారు.

- తటవర్తి జానీ

ఇక రహదారులపై గుంతలుండవ్!

(5వ పేజీ తరువాయి)

ఆత్మకూరు నియోజకవర్గంలో 70 కోట్లతో అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులకు మరమ్మతులు పూర్తి చేస్తామని అన్నారు. తొలుత మాముడూరు గిరిజన కాలనీలో సిమెంట్ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టీడీపీ సీనియర్ నాయకుడు గిరినాయుడు ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, ఆత్మకూరు ఆర్డీవో పావని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్‌లో అన్నంతో జగన్నాథుడి చిత్రం అలంకరణ

వైభవంగా గోవర్ధన పూజ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ మందిరంలో శనివారం గోవర్ధన పూజ జరిగింది. ఈ సందర్భంగా ఇస్కాన్ గోశాలలో అన్నంతో జగన్నాథుడు, సుభద్ర చిత్రాలను వేసి పూలు, పండ్లతో అలంకరించి పూజించారు. అ నంతరం గో వులకు పూజలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి గోవర్ధన పూజను గురించి ప్రవచనం చేశారు. అనంతరం భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. భక్తులకు అన్నప్ర సాదాల వితరణ జరిగింది.



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌ఈ దేశానాయక్

490 నీటి వినియోగదారుల సంఘాల

ఎన్నికలకు 20న నోటిఫికేషన్

● మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో ఇరిగేషన్ ఎస్‌ఈ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2 : జిల్లాలోని 490 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఎస్‌ఈ దేశానాయక్ చెప్పారు. కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా దేశానాయక్ మాట్లాడుతూ సంఘాల అధ్యక్ష పదవులకు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష పదవు లకు, 7 ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పారు. సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికలు 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఎన్నికల నిర్వ హణకు 980 మంది పోలింగ్ అధికారులను, 7396 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈ శిక్షణంలో సోమశిల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకట రమణారెడ్డి, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, నెల్లూరు, కావలి ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, నీటిపా రుదలశాఖ ఈఈలు, డీఈఈలు, తహ సీల్దార్లు తదిత రులు పాల్గొ న్నారు.

శ్మశానం కాదు.. పుణ్యక్షేత్రం

అది శ్మశానం కాదు.. పుణ్యక్షేత్రం. మృతదేహాలకు అంత్యక్రియలు చేసే సమయంలో ప్రశాంతత కావాలి. డంపింగ్ యార్డుగా మారిన శ్మశానంలో మృతదేహాలను పూడ్చడం కష్టంగా మారడం కలచివేసింది. దాతల సహకారంతో కైలాసభూమిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. ఏడాదికొకసారి చితాభస్మాన్ని పుణ్యనదుల్లో కలుపుతున్నాం. అందరూ అభినందిస్తుంటే ఆనందంగా ఉండటంతోపాటు బాధ్యత మరింత పెరిగింది.



- దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, కైలాసభూమి అభివృద్ధి కమిటీ సభ్యుడు.

కోవూరులోని కైలాసభూమి



నాటి తైదిబ్బే నేటి కైలాసభూమి!

● సర్వాంగ సుందరంగా శ్మశానం అభివృద్ధి

● దాతల చేయూతతో ఆహ్లాదకర వాతావరణం

● ఆకట్టుకుంటున్న శివ, సత్యహరిశ్చంద్ర విగ్రహాలు


గ్రామ పొలిమేరలో ఏర్పాటు చేసి శ్మశానవాటిక కాల క్రమంలో డంపింగ్ యార్డుగా మారిపోయింది. అలాంటి ప్రాంతంలో మృత దేహాలకు క్రతువులు నిర్వహిం చడం అసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో కొందరు ఓ కమిటీగా ఏర్పడి దాతల సహకారంతో అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. దీంతో నాటి తైదిబ్బగా పిలుచుకునే శ్మశాన వాటిక నేడు కైలాస భూమిగా మారింది.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

కోవూరు గ్రామ పొలిమేరలో వందలాది సంవత్సరాల క్రితం నాటి శ్మశాన వాటికను తైదిబ్బ గా పిలుసుకునేవారు. అయితే, కొన్నాళ్లుగా కోవూరు, పడుగుపాడు పంచాయతీల పరిధి లో వచ్చిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వాహనాల్లో తీసుకొచ్చి ఈ ప్రాంతంలో గుట్ట లుగా పోయడంతో శ్మశానం కాస్త డంపింగ్ యార్డుగా మారింది. దీంతో మృతదేహాలను శ్మశానంలోకి తీసుకొచ్చి క్రతువులు నిర్వహిం చేందుకు తీవ్ర ఇక్క ట్లను ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో అయితే అడుగుపెట్టే పరిస్థితి ఉండేదికాదు. ఈ పరిస్థితి నుంచి ప్రజల కష్టాలను గట్టెక్కిం చాలని భావించిన కొందరు స్థానికులు శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీగా ఏర్ప డ్డారు. చెత్తాచెదారం, శిథిల మైన సమాధు లను తొలగింపజేశారు. దాతలను సంప్ర దించి వారి సహకారంతో నీరు, విద్యుత్తు వసతి కల్పించడంతోపాటు మృతదేహాలను కాల్చేందుకు షెల్టర్లు, పొయ్యిలు, కర్మకాం డలు నిర్వహించేందుకు, మృతుల బంధువులు బస చేసేందుకు విశ్రాంతి భవనాలు నిర్మించారు. అంతేగాక 500 మృతదేహాల అస్థికలు భద్రపరచేందుకు లాకర్లనూ సిద్ధం చేశారు. అలాగే దూరప్రాంతాల్లో ఉన్న ఆప్తులు వచ్చే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు వీలుగా ప్రత్యేక గదిని కూడా నిర్మించారు. శివుడు, మృత్యుంజయుడి స్తూపం, కాల్పుల షెల్టర్ల సమీపంలో సత్యహరిశ్చంద్రుడి విగ్రహం ఏర్పాటు చేశారు. వీటన్నిటితోపాటు కైలాసభూమి లో పచ్చని చెట్లు ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందిం చారు. ప్రధాన ద్వారం, సత్యహరిశ్చంద్రుడి విగ్రహం ప్రారంభానికి ఇటీవల వచ్చిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కైలాసభూమిని చూసి అభివృద్ధి కమిటీని ప్రత్యేకంగా అభినందించారు.



మృతదేహాలను భద్రపరిచే భవనం ఇదే!



మృత్యుంజయ స్తూపం

ఓ ఎన్నారై దాతృత్వం ఎలక్ట్రికల్ శవ దహనశాల

పట్టణాలకే పరిమితమైన ఎల క్ట్రికల్ శవ దహనశాల ఓ ఎన్నా రై దాతృత్వంతో గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైంది. మండలంలోని కొమరికకు చెం దిన ఇందుపూరు పవన్‌కుమార్‌రెడ్డి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. తన స్వగ్రామమైన కొమరికలో ఎవరైనా మృతి చెందితే సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్నారు. గతేడాదిన తన నాయనమ్మ మృతి చెందడం, అదే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో గ్రామంలో దహన సంస్కారాలు చేసే వీలులేక నెల్లూరుకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితి తమ గ్రామస్థులకు కలగకుండా తనవంతు సాయంగా ఎలక్ట్రికల్ శవ దహనశాల నిర్మించాలని సంకల్పించారు. అందుకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన గూడూరు ప్రభాకర్‌రెడ్డి, గూడూరు శివకుమార్‌రెడ్డిల పర్యవేక్షణలో పనులు ప్రారంభింపజేశారు. సుమారు రూ.6లక్షలు వెచ్చించి ఎలక్ట్రికల్ శవ దహ నశాల భవనాన్ని నిర్మించి కొమరిక గ్రామ ప్రజలకు అంకితం చేశారు. దీంతో ఇకపై దహన సంస్కారాలు తమ గ్రామంలోనే చేసుకునేందుకు వీలు కలగడంపై సంతోషం వ్యక్తం చేస్తు న్నారు. ఈ సందర్భంగా ఎన్నారై పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమలాగా గ్రామస్థులు ఇబ్బందిపడకూడదనే సంకల్పంతో రూ.6లక్షలతో దహనశాలను నిర్మించినట్లు చెప్పారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)

ఎన్నారై పవన్‌కుమార్‌రెడ్డి నిర్మించిన ఎలక్ట్రికల్ దహన శాల





ఈ దుస్థితి ఇంకెన్నాళ్లు!?

ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఇందుకూరుపేటలోని గ్రంథాలయ భవనం. దీన్ని 1988లో జడ్పీ చైర్మన్ డేగా నరసింహారెడ్డి ప్రారంభించారు. కొన్నేళ్లుగా శిథిలావస్థలోకి చేరుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రంథాలయ భవనం తడిచి పెచ్చులూడి పడుతున్నాయని పలువురు పాఠకులు పేర్కొంటున్నారు. గ్రంథాలయానికి మరమ్మతులు చేయాలని, లేదా మరో భవనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)



ఈ మట్టితో నాణ్యత ఎలా!?

రెండేళ్ల క్రితం భవన నిర్మాణం కోసం తీసిన పునాదుల్లోని మట్టిని మళ్లీ అదే భవనం బేసుమట్టాలకు ఉపయోగిసున్నారు. బుచ్చిలోని అంబేడ్కర్ భవనం ఎదురుగా నిర్మిస్తున్న కొత్త నగర పంచాయతీ భవనం బేసుమట్టాలకు సుద్ద, బంకతో పెద్ద గడ్డలుకట్టి ఉన్న మట్టిని వాడితే అసలు నాణ్యత ఉంటుందా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై స్థానికుడు వింజమూరు వెంకటేశ్వర్లు మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేస్తూ మున్సిపల్ గ్రూప్‌లో పోస్టు కూడా చేశారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణంలో నాణ్యతా, ప్రమాణాలు ఉండేలా చూడాలని ఆయన కోరారు.

- బుచ్చిరెడ్డిపాళెం, ఆంధ్రజ్యోతి)

121 ఏళ్లకూ చెక్కు చెదరని వంతెన

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 121 ఏళ్ల చరిత్ర కలిగిన వంతెన ఇప్పటికీ చెక్కుచెదరలేదు. రెండు గ్రామాల మధ్య వారధిలా ఉన్న ఈ వంతెన 150 ఎకరాల భూముల్లోకి వెళ్లే రైతులకు దారైంది. నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులో నెల్లూరు కాలువకు వరద ప్రవాహాన్ని తీసుకెళ్లే లొడుము తూములపై 1903లో బ్రిటీష్ ప్రభుత్వం దీనిని నిర్మించింది. గొల్లకందుకూరు నుంచి మహ్మదాపురంకు ఈ వంతెన పైనుంచే వెళ్లాలి. ఎక్కడ చిన్న బలహీనత లేని ఈ వంతెన ఇప్పటికీ పటిష్టంగా ఉండి అందరినీ ఆకర్షిస్తోంది. వంతెనపై ఇరువైపుల రక్షణ గోడలు కాస్త ఇబ్బందికరంగా ఉండటం తప్ప నిర్మాణంలో ఇబ్బందులు లేవని ఈ ప్రాంతవాసులు చెప్తున్నారు.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)



పామాయిల్ పరిశ్రమలో దట్టమైన పొగలు

● స్థానికుల భయాందోళన



బాయిలర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు బాలకృష్ణారెడ్డి

ముత్తుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంటపాలెం సమీపంలోని పామాయిల్ పరిశ్రమలో శనివారం దట్టమైన పొగలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. బాయిలర్ నిర్వహణ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఫ్యాక్టరీ నుంచి దట్టమైన బొగ్గుతో కూడిన నల్లటి పొగలు చుట్టుపక్కలకు అలుముకున్నాయి. దీంతో అక్కడ పని చేసే వారితో పాటు చుట్టుపక్కల ఉన్నవారు ఏమైనా ప్రమాదం జరిగిందేమోనని భయపడ్డారు. కొద్దిసేపు ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. బాయిలర్ మెయింటెనెన్స్ సమయంలో జరిగిన కెమికల్ రియాక్షన్ ఈ పొగలకు కారణంగా భావిస్తున్నారు. కొద్ది నిమిషాల పాటు చుట్టు పొగతో కూడిన మేఘాలు అలుముకోవడంతో మళ్లీ ఏదో ప్రమాదం జరిగిందని భావించారు. అయితే బాయిలర్‌ను ఓపెన్ చేయగానే ఒక్కసారిగా అందులో ఉన్న బొగ్గు పొగతో పాటు బయటికి రావడమే కారణమని పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు బాలకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనకు కారణమైన బాయిలర్‌ను చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. నిర్వహణ పనుల సమయంలో ఏర్పడిన ఇబ్బంది వల్లే పొగలు వచ్చాయని, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని ఆయన తెలిపారు.

జీజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంతోనే తన తల్లి మృతి

● దర్గామిట్ట పోలీసులకు మృతురాలి కుమారుడి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కొడుకు శేషవరావు

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన తల్లి రాచూరు లక్ష్మి(75) మృతి చెందిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుమారుడు రాచూరి శేషవరావు కోరారు. ఈ మేరకు శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం లోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన రాచూరు లక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో గత నెల 29వ తేదీన నగరంలోని జయభారత్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రభుత్వ జనరల్ ఆసు పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. ఈ పరిస్థితికి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని, వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుండెపోటుతో ప్రైవేట్ బస్సు క్లీనర్ మృతి



మృతుడు రమేష్ (ఫైల్)

ఏఎస్‌పేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు క్లీనర్ మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆత్మ కూరు మున్సిపాలిటీ పరిధిలోని ముస్తాపురం గ్రామనికి చెందిన గడ్డం రమేష్ ఏఎస్‌పేట-హైదారా బాదుకు నడిచే ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గత కొంతకాలంగా క్లినర్‌గా పనిచేస్తున్నాడు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం డ్యూటీకి వెళ్లాడు. ఏఎస్‌పేట నుండి హైదారాబాదుకు వెళ్లి తిరిగి శుక్రవారం సాయంత్రం ఏఎస్ పేటకు బస్సు బయలదేరింది. రాత్రి 12 గంటల వరకు మేల్కొని ఉన్న రమేష్ ఆతరువాత డ్రైవర్ వెనుక సీటులో పడుకున్నాడు. శనివారం ఉదయం బస్సు ఏఎస్ పేటకు వచ్చిన తరువాత ప్రయాణికులు అందరూ దిగినా రమేష్ లేవలేదు. దీంతో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ సైదులు చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ భూముల వేలంలో ఘర్షణ

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు2: స్థానిక పెద్దూరులోని సీతా,లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఆలయ భూములకు శనివారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి అధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో వేలంపాటలు జరుగుతుండగా పాటదారుల మధ్య చెలరేగిన వాదోపవాదాలు ఘర్షణకు దారితీశాయి. ఒకరిపై ఒకరు కుర్చీలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో ధర్మకర్త మురళీకృష్ణారెడ్డి, బందోబస్తుకు వెళ్లిన పోలీసులు వారిని అడ్డుకుని వారించారు. వేలంపాటలను వాయిదా వేశారు.

మాజీ సర్పంచిపై దాడి

జలదంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములపాడు మాజీసర్పంచి మల్లి వెంకయ్యపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం ఉదయం ఆయన బహిర్భూమికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఇర్ల పోలయ్య, మల్లె వెంకటేశ్వర్లు మరో ఇద్దరు మహిళలు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. దాడి వెంకయ్యకు తలపై, చేతులపై గాయాలయ్యాయి. వీరికి గత కొంత కాలంగా పంటపొలాల విషయమై విభేదాలు ఉన్నాయి. ఈ ఘటనపై జలదంకి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. నిందుతులను పోలీసులు అదుపులోకి తీసుకోవాలని మాజీసర్పంచ్ వెంకయ్య డిమాండ్ చేశారు.

● ఆ విధానానికి వైసీపీ ప్రభుత్వం మంగళం
● రిజిస్ట్రేషన్లకు వ్యాధిగ్రస్థులు, వయోవృద్ధుల అవస్థలు
● రూ.లక్షలు తీసుకుని అమలు చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు?

ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్

కనుమరుగు



నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చి దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేయించుకోలేని వారి కోసం ప్రైవేట్ అటెండెన్స్ పేరుతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గతంలో ఆ శాఖ అమలు చేసేది. రోగగ్రస్తులైన వారు, వృద్ధులు, గౌరవప్రద మహిళలు, జైళ్లలో ఖైదీలుగా ఉన్న వారు తమ రిజిస్ట్రేషన్లు ఈ ప్రైవేట్ అటెండెన్స్ విధానం ద్వారా చేయించుకునే వారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి మంగళం పాడింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లలేని వారికి దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించుకోవటం కష్టతరంగా మారింది. కదలలేని స్థితిలో మంచం మీద ఉండే వారిని, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్ట్రెచర్ మీద తీసుకునివచ్చి దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇళ్లకు వెళ్లి రిజిస్ట్రేషన్

ప్రైవేట్ అటెండెన్సు విధానం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకొనే వారి ఇంటికి సబ్ రిజిస్ట్రార్లు వెళ్లి ఆస్తి వివరాలను పరిశీలించి రిజిస్ట్రేషన్లు చేసే వారు. వైద్యశాలలకు కూడా వెళ్లే వారు. మంచంలో ఉండి లేవలేనివారికి, అనారోగ్య బాధితులకు ఈ విధానం ఎంతో సౌకర్యవంతంగా ఉండేది.

డబ్బాశతో అమలు చేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు

ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ విధానం అమలులో లేకపోయినా కొందరు సబ్ రిజిస్ట్రార్లు డబ్బుకు ఆశపడి అనారోగ్య బాధితుల ఇళ్లకు వెళ్లి, వైద్యశాలలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇందుకుగాను రూ.లక్షల్లో నగదు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వయోవృద్ధులు, రోగగ్రస్తులను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ అటెండెన్స్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆ విధానాన్ని పునరుద్ధరించాలి



రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రాలేని వారికి ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ విధానం ఎంతో ఉపయోగకరం. గత ప్రభుత్వం లో దీనిని రద్దు చేశారు. దీనిని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా లేఖలు పంపాం.

- పట్నం దుర్గేష్‌బాబు, జిల్లా డాక్యుమెంటు రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

రేపు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పెన్షనర్స్ భవనంలో ఈనెల 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోషియేషన్ జిల్లా కార్యవర్గం సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం.గౌస్, కార్యదర్శి ఎస్‌వీవీఎస్.మూర్తిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం పాల్గొంటారని పేర్కొన్నారు. పెన్షనర్లు తమ పెన్షన్ ఆధారంగా తీసుకునే రుణాలపై ప్రభుత్వం రికవరీ చేస్తున్న అదనపు కమ్యూటేషన్‌ను తక్షణం నిలిపివేయాలనే దానిపై కార్యచరణ ప్రణాళిక ఆయన వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు డాక్టర్ అగర్వాల్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని, అసోసియేషన్ కార్యవర్గం, సభ్యులు అందరూ హాజరుకావాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరి డీబార్

వెంకటాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శనివారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలలో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 3761 మంది విద్యార్థులకుగాను, 3509 మంది హాజరు కాగా, 252 మంది గైర్హాజరయ్యారని వివరించారు. నెల్లూరులోని సర్వోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

'జనవాణి'లో ఫిర్యాదుల స్వీకరణ

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ బీఎస్సీ చేసి స్వయం ఉపాధి కోసం బ్యాంకులో రుణాలకు దరఖాస్తు పెట్టుకున్న వారికి రుణాల మంజూరులో ఎందుకు జాప్యం చేస్తున్నారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన జనవాణి కార్యక్రమం మహిళల నుంచి అందిన ఫిర్యాదుకు ఆయన స్పందిస్తూ బ్యాంకు మేనేజర్ల దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరూ స్పందించక పోవడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు వెంకట్రావు, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో జరిగిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు సమయపాలన పాటించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఎఫ్ఆర్ఎస్ వేయని వారికి నెలవారి వేతనంలో కోత పెడుతామని తెలిపారు. ల్యాబ్‌ల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా చేపట్టి సరైన ఫలితాలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ వ్యాధికి సంబంధించి గళ్ల పరీక్షలు తగిన ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. ఫలితాల వివరాలను యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. సహాయ మలేరియా అధికారి నాగార్జున మాట్లాడుతూ మలేరియా రక్తపరీక్షల నమూనాల సేకరణ లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ సీజన్‌లో జ్వరపీడితులు ఎక్కువగా నమోదవుతున్న కారణంగా సకాలంలో వారికి రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. డెంగ్యూ, మలేరియా అని తేలితే వెంటనే తగిన వైద్య చికిత్సలు అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

● ఆటలకు ముస్తాబైన సౌత్‌మోపూరు



హైస్కూల్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌత్‌మోపూరులో 17 ఏళ్ల లోపు బాలబాలికలకు 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఆదివారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం ముస్తాబైంది. ఈ మేరకు శనివారం విద్యాశాఖ, క్రీడాసమాఖ్య, జడ్పీ హైస్కూల్ యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 600 మంది హాకీ క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, 50 మంది క్వాలిఫైడ్ అంపైర్లు పాల్గొననున్నట్లు సంబంధింత అధికారులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి ఈ నెల 20 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని రోహతక్ జిల్లాలో జరుగు జాతీయస్థాయి పాఠశాల హాకీ పోటీలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా సౌత్‌మోపూరులోని రాష్ట్రస్థాయి పోటీలకు వస్తున్న బాలురకు గ్రామంలోని కల్యాణ మండపం, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, బాలికలకు జడ్పీ హైస్కూల్లో వసతి ఏర్పాటు చేసి, భోజన ఏర్పాట్లు చేసినట్లు జడ్పీ స్కూల్ పీడీ నాగేంద్రరావు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

● డీఈవోకు ఆపస్ నేతల వినతి

నెల్లూరు(విద్య), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆపస్ నేతలు డీఈవో బాలాజీరావును కోరారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఆపస్ నేతలు నూతన జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కెకె.రాజగోపాలాచారి మాట్లాడుతూ అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, పని సర్దుబాటులో కూడా వీటిని భర్తీ చేయలేదన్నారు. హైస్కూల్ ప్లస్ స్థాయి తరగతులకు కూడా ఉపాధ్యాయులను కేటాయిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.అనిల్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి పీ.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎల్.వాసు, జీ.మల్లికార్జున, నేతలు ఎస్.శ్రీనివాసులనాయుడు, రాజశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో బయోమెట్రిక్ హాజరు వేయాలి

● బీసీ సంక్షేమాధికారి ప్రసూన



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి ప్రసూన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు వేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి కొల్లి ప్రసూన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను ఆదేశించారు. శనివారం ఏబీసీడబ్ల్యువో కార్యాలయంలో హెచ్‌డబ్ల్యువోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు వేయకపోతే హెచ్‌డబ్ల్యువోలకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. బాలికల హాస్టళ్ల నుంచి బాలికలను వారి తల్లిదండ్రులు వచ్చినప్పుడు మాత్రమే బయటకు పంపాలని, అందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7591
వెండి కిలో ధర	రూ. 96,700
వెండి ఒక గ్రాము	రూ.99.70

17 నుంచి శబరిమలకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● ప్యాకేజీ ప్రకటించిన ఈడీ వెంటేశ్వరరావు

నెల్లూరు(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శబరిమలకి వెళ్లే అయ్యప్ప భక్తులకు ఈనెల 17 వ తేదీ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తులకు మెరుగైన సేవలతో ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించామన్నారు. శబరిమలై టూరుకు ఐదు రోజులు రాను, పోను ఒక్కొక్కరికి సూపర్‌లగ్జరీ రూ.4వేలు, అల్ట్రాడీలక్స్ రూ.3900, ఎక్స్‌ప్రెస్‌కు రూ.3300 చార్జీ నిర్ణయించామని తెలిపారు. అలాగే భక్తులు కోరుకున్న మార్గంలో పుణ్య క్షేత్రాలు దర్శించుకుంటూ వెళ్లేందుకు మరో విధమైన ప్యాకేజీని నిర్ణయించామన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక కిలో మీటరుకు రూ.57, అల్ట్రాడీలక్స్‌కు రూ.61, ఎక్స్‌ప్రెస్‌కు రూ.62, అల్ట్రా పల్లెవెలుగు రూ.62 లెక్కన ఉంటుందన్నారు. మొత్తంగా రోజుకు 420 కిలోమీటర్ల ప్రకారం లెక్కిస్తామని తెలిపారు. శబరిమలకి వెళ్లే టప్పుడు కాణిపాకం, భవాని, ఎరిమేలు, పంబ, తిరిగి వచ్చే టప్పుడు కుర్తాళం, మదురై, చెన్నై, మేల్‌మరువత్తూర్ మీదుగా వస్తుందన్నారు. ఈ ప్రత్యేక బస్సులు నవంబరు 17, 18, 20, 22, 25, 26, 28వ తేదీలలో, డిసెంబరు 3, 4, 6, 10, 11, 13, 17, 18, 20, 22, 25, 28, జనవరి 3, 5, 7 తేదీలలో ఆర్టీసీ మెయిన్ బస్టాండ్ నుంచి ఉదయం 10 గంటల నుంచి బయలు దేరుతాయన్నారు.

● శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పరమేశ్వరికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో మూడు శైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంలకు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నుంచి నవంబరు 2, 8, 9, 16, 23 తేదీలలో రాత్రి 8 గంటలకు బస్సు బయలు దేరుతుందని తెలిపారు. బస్సు చార్జీ రూ.1800లని చెప్పారు. అలాగే అరుణాచలం కూడా ప్రత్యేక బస్సులు వేస్తున్నామని, భక్తులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెల్లూరు 1, 2 డిపోలు, రాపూరు, ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, కందుకూరు డిపోలలో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మురళీబాబు, నెల్లూరు 1, 2 డిపో మేనేజర్లు మురళీకృష్ణ, శివకుమార్, షమీమ్, సునీత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఆయుర్వేద సేవలు బంద్

● పట్టించుకోని ఉన్నతాధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాల గత రెండేళ్ల నుంచి తలుపులు తెరుచుకోక పోవడంతో మండల ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందని ద్రాక్షలా మిగిలింది. ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యాధికారి, కాంపౌండర్, ఎమ్.ఎన్.ఓ, పీటీఎస్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. కందుకూరు రెగ్యులర్ వైద్యాధికారి లక్ష్మీకుమారిని వలేటివారి పాలెం ఆయుర్వేద వైద్యశాలకు ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఆమె ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించడం లేదు. అసలు వైద్యశాలకు రావడం లేదు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వైద్యం కోసం ప్రజలు వైద్యశాలకు వచ్చేవారు. ఎంతో ప్రాశస్త్యమున్న ఈ ఆయుర్వేద వైద్యాన్ని పట్టించుకోక పోవడం బాధకరం అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీళ్ల నొప్పులు, జ్వరం, చర్మవ్యాధులు, దగ్గు, జలుబు, స్త్రీ సంబంధిత వ్యాధులు, చర్మరోగాలు పక్షవాతం, మూర్ఛ, ఉబ్బశం, పార్శ్వపు నొప్పులు, గ్యాస్ట్రబుల్, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, శ్వాస, గుండె సంభందిత వ్యాదులను ఇట్టే పసిగట్టే నయం చేసే అద్భుతమైన మందులు ఆయుర్వేదంలో ఉండేవి. గత రెండేళ్ల నుండి వైద్యశాల తలుపులు కూడా తెరవలేదు. దీంతో ఆయుర్వేద వైద్యం కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైద్యశాల మూతపడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల

ఏరుకొల్లులో వైద్యశిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏరుకొల్లు ఎస్సీ కాలనీలో జ్వరాలు విజృంభించడంతో వైద్యులు అయూబ్‌అప్సర్ ఆధ్వర్యంలో శనివారం వైద్యఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా లార్వా సర్వే చేపట్టి వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని హజరత్ మష్కూర్ అలీషాఖాదరీ దర్గాలో శనివారం గ్యార్వీ షరీఫ్ మహబుబ్ సుబాని గంధ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

సిమెంట్ రోడ్ల పరిశీలన

సీతారామపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్‌ఆర్ నగర్‌లో ఇటీవల నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్‌బాబు బృందం పరిశీలించారు. అనంతరం బసినేనిపల్లి, ఎస్‌ఆర్ నగర్‌లో మిగిలిన సిమెంట్ రోడ్లను కూడా త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎన్‌ఆర్ఇజిఎస్ ఈసీ సువార్తయ్య, ఇంజనీర్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యగణన పూర్తి చేయాలి

కొండాపురం, నవంబరు 2: విద్యావంతులైన యువతలో నైపుణ్యగణన త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఆనందరావు పంచాయతీ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత ఏ రంగంలో ఎక్కువగా ఆసక్తి చూపుతారో ఆ విషయాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో శేషసాయి పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ఉలవపాడు, నవంబరు 2: గ్రామీణ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ బాబురావు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలను హెచ్చరించారు. శనివారం కరేడు, ఉలవపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు ఉలవపాడు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. నెల్లూరు నుంచి ఒంగోలుకు ఇసుక లోడుతో వెలుతున్న టిప్పర్లను గమనించి రాజపాలెం వద్ద వాటిని ఆపి అనుమతి పేపర్లు, డాక్యుమెంట్లు తనిఖీ చేయగా ఆధారాలు చూపలేదన్నారు. ఒంగోలు మైనింగ్ ఏడీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

కావలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ బుడంగుంట- చౌదరిపాలెం రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. తొలుత గ్రామంలోని అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణాలు, చివరి ఆయుకట్టుకు కూడా ఉండేలా సాగు నీరు విడుదల, కావలి పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా భూసేకరణ, మాహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందచేస్తూ రామరాజ్యంలా పాలన సాగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా రోడ్లపై తట్టెడు మట్టి వేసిన పాపాన పోలే దన్నారు. కావలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గుంటలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్ బాబు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 22మంది ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు రూ.22,04,735ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. కుటుంబ పెద్దగా ప్రతిఒక్కరి బాగోగులను చూసుకుంటున్నారని చెప్పారు. ఇతర ప్రాంతాలలో శస్త్రచికిత్సలు పొందిన వారు కూడా ఆరోగ్యశ్రీ కింద ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు, యేగూరి చంద్రశేఖర్, తిరువీది ప్రసాద్, తటవర్తి వాసు, నాగిశెట్టి, నాయుడు పాల్గొన్నారు.

గుంతల రహిత నియోజకవర్గమే లక్ష్యం

లింగసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలరహిత నియోజకవర్గమే తన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మేదరమెట్లపాలెంలో గుంతలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మేదరమెట్ల పాలెంలోని బస్సు షెల్టర్ నుండి పెదపవని గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచు కూరపాటి మాధవి, ఆర్‌అండ్‌బీ ఈఈ రామకృష్ణ ప్రసాద్, డీఈ చక్రధర్, భాస్కర్, శ్రీను, రమేష్, సాంబయ్య, సయ్యద్ నాయబ్‌రసూల్, మనోహర్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

● కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మాల ధారులకు శనివారం అయ్యప్ప సేవాసంఘం సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే ఇంటూరి అన్న ప్రసాద శాశ్వత భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, అయ్యప్ప సేవా సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, మాల ధారులు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడును కలిసిన రాజేష్

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. బీఆర్ నాయుడుకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాలకొండ ఆదాయం

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం రూ.8.99 లక్షల హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ చట్టాలు.. రక్షణ కవచాలు

● ఆర్ శేఖర్, ఆత్మకూరు అటవీ రేంజ్ క్షేత్రస్థాయి అధికారి



ముఖాముఖి

? అటవీశాఖ చట్టాలపై ప్రజలకు ఏ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

! జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, మానవ మనుగడలో కీలక పాత్ర పోషిస్తున్న అడవులపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

? ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఈ ఏడాది ఎన్ని మొక్కలు పెంచేందుకు నిర్ణయించారు.

! ఉపాధిహామి పథకం కింద 90వేల మొక్కలు నర్సరీల్లో పెంచేందుకు నిర్ణయించాం.

? నూతనంగా ఎన్ని హెక్టార్లలో ప్లాంటేషన్ చేయబోతున్నారు.

! ఆత్మకూరు రేంజ్ పరిధిలో 195 హెక్టార్లలో నూతనంగా ప్లాంటేషన్ చేయబోతున్నాం. ఇప్పటికే ఏఎస్ పేట, అనంతసాగరం మండలాల్లో 140 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తిచేశాం. మిగిలినవి త్వరలో పూర్తి చేస్తాం.

? అటవీ ప్రాంతంలో మొక్కలు పెంచేందుకు ఏమేరకు నిధులు మంజూరయ్యాయి.

! నర్సరీలను అభివృద్ధి చేసి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు రూ. 7.20 లక్షలు మంజూరయ్యాయి.

గృహాల నిర్మాణం పూర్తి చేయాలి



అల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు వివిధదశల్లో నిలిచిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. నార్తుఆములూరు, నార్తుమోపూరు, అల్లూరుతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నూతన కాలనీల్లోని పక్కా గృహాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి విచారణ చేపట్టారు. వివిధదశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్‌అండ్‌టీ అనుబంధ సంస్థ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్స్ (ఎస్‌డీవీపీఎల్) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు శనివారం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలో 8మంది విద్యార్థులు డిజైన్ ఇంజనీర్లుగా ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికై కళాశాలలో ఆ బ్రాంచి సమర్థతను చాటారని సివిల్ హెచ్‌ఓడీ డాక్టరు రాఘవశర్మ, వి. శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆల్‌సోల్ ఫెస్టివల్

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలుమేజర్ పంచాయతీలోని బ్రిటీష్ పాలనలో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాదులతోటలో శనివారం ఆల్‌సోల్ ఫెస్టివల్ ఆనందోత్సవాలతో నిర్వహించారు. మండల ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. రకరకాల పూలతో పెద్దలు, కుటుంబ సభ్యుల సమాదులను అలంకరించుకుని చర్చి ఫాదర్స్, సంఘకాపరులు, పాస్టర్లచే ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. సమాదుల తోటలో విద్యుత్ దీపాలంకరణ, బాణాసంచా కాల్చుతు దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు కలనుకుని ఆప్యాయతగా పలకరించుకున్నారు.

హత్యకేసు ముద్దాయి అరెస్ట్

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): నందెమ్మపురం కాటంగారి జాలమ్మ హత్య కేసు ముద్దాయి ఆవుల మునెయ్యను శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 27వ తేదీన మునెయ్య జాలమ్మ తలపై విచక్షణారహితంగా కర్రతో కొట్టడంతో ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ కేసులో ముద్దాయి అయిన మునెయ్యను చెన్నాయ పాలెం వద్ద సీఐ రాజేశ్వరరావు సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు.

ఎట్టకేలకు సర్వసభ్య సమావేశం

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండుసార్లు వాయిదా పడిన మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మొక్కుబడిగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఎంపీపీ మేకల సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, జడ్పీటీసీ కీర్తన, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, ఏవో గోవిందరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దగదర్తి (బిట్రగుంట) (ఆంధ్రజ్యోతి): పెద్దపుత్తేడు, ఉప్పలపాడు గ్రామాల మధ్య పంటపొల్లాల సమీపంలోని పేకాట స్థావరాలపై ఎస్ఐ జంపానికుమార్ శనివారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 12,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థి ఉమాసాయిరాం

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం గ్రామంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న మెయిన్ ప్రాథమిక పాఠశాలకు శనివారం పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహీదాఅక్తర్‌కు అద్దె నగదు చెల్లించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు అద్దె భవనంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచన మేరకు పూర్వ విద్యార్థి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, వారి మిత్ర బృందం అద్దె భవనానికి ప్రతినెలా రూ.3 వేల నగదును అందజేస్తామని ముందుకొచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని అభినందించారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పాఠశాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని కోరారు.

8న మండల సమావేశం

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన 8వ తేది శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నరేంద్రదేవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, కార్యదర్శులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని మండలంలోని వైసీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగం బ్యారేజీ వద్ద ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తుంగా ఇందుధర్‌రెడ్డి, నాయకులు బాలచంద్రారెడ్డి, షేక్ కరీముల్లా, ముడి మల్లికార్జునరెడ్డి, మదన్‌మోమన్‌రెడ్డి, ఫణికుమార్, కోటారెడ్డి, జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

●ఆత్మకూరు : పట్టణంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో, నెల్లూరుపాళెం వద్ద ఉన్న గౌతమ్‌రెడ్డి విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఎంజీఆర్ బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న వైసీపీ నేతలు

భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం ఏర్పాటు

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో కార్తీక ఆకాశ దీపం వెలిగించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి మండపం ఎదురుగా అఖండ దీపం వెలిగించారు. అనంతరం పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, యర్రబల్లిగడ్డ, లింగాలదొన, గుడినరవ, అప్పసముద్రం, జీ.అయ్యవారిపల్లి, ఆర్లపడియ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.


ధ్వజ స్తంభంపై వెలిగిస్తున్న ఆకాశ కార్తీక దీపం


సిద్ధేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్‌ఆర్ పేట పంచాయతీ కొత్తూరులో వెలసిన కోదండ రామాలయంలో సీతారామలక్షణాంజనేయ్యస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగోలు కుమ్మరివీధి శివాలయంలో కార్తీకమాస ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి ఆనం చొరవతో రహదారికి మరమ్మతులు

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో శనివారం స్థానిక కెనరా బ్యాంకు సమీపంలోని రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై మురికినీరు ప్రవహించి భారీ గుంత ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో చేజర్ల మండలంలోని మాముడూరుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెళ్తుండగా స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. దీంతో సాయంత్రానికి అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రహదారికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

వైసీపీ హయాంలో పనులు చేయకుండా దోపిడీ

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో సాగునీటి కాలువల పూడికతీత పనులు చేయకుండానే కాకాణి గోవర్ధనరెడ్డి వందల కోట్ల నిధులు దోచుకున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన సంగం బ్యారేజీ కుడివైపు కనుపూరు కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకుసాగుతున్నాయన్నారు. అందుకు ప్రస్తుతం నియోజకవర్గంలో రైతులే స్వయంగా సాగునీటి కాలువల్లో తీస్తున్న పూడికతీత పనులే నిదర్శనమన్నారు. జిల్లాలో రూ. 28 కోట్లతో ఓఅండ్ఎం కింద సుమారు 436 పనులు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రూ. 8 కోట్లతో వందల సంఖ్యలో పనులు జరుతుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరిగేషన్ డీఈలు శంకరనారాయణ, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, అప్రమత్తతతో వ్యవహరించాలని స్థానిక కోటారెడ్డినగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి బ్యూలాగ్రేస్ తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆదిఆంధ్రకాలనీలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె జ్వరాలు, జలుబులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉన్నందున వ్యాధులు వస్తున్నట్లు గుర్తించామన్నారు. వైద్యాధికారి, సిబ్బంది ఫా గింగ్, బ్లీచింగ్, పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సబ్ యూనిట్ అధికారి రవిచంద్ర ఆధ్వర్యంలో ఆదిఆంధ్ర కాలనీలోని నివాసాల్లో దోమల నిర్మూలన మందును పిచికారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందే ఆవాసాలు పరిసరాల్లో లేకుండా చూసుకోవటంతో పాటు ఈ సీజన్‌లో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ఇంటూరి పద్మావతి, ఏఎన్ఎం పల్లవి, రమ్య పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో శనివారం అవినీతి నిర్మూలన వారోత్సవాల కార్యక్రమంలో మేనజర్ సురేష్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు తోటి విద్యార్థులతో పోటీపడి చదివి ప్రోత్సాహక బహుమతులు అందుకోవాలని కోరారు. అనంతరం ఏపీజీబీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10,9,8వ తరగతి పరీక్షలతో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులు చుండి నిఖేష్‌కుమార్, కళ్లగుంట తేజకు, గాజులవర్తి తేజశ్రీలకు హెచ్ఎం కమల్‌కుమార్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఉల్లాస్ కార్యక్రమంపై వీవోఏలకు శిక్షణ

ఉదయగిరి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం వీవోఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో ఉండే నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అందుకు సంబంధించి 20 మంది వీవోఏలు, 13 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాజారతుల్లా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

● కొండాపురం : నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు వీవోఏలకు శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణరావు మాట్లాడారు. 15ఏళ్లు పైబడి నిరక్షరాస్యులైన వయోజనులను తొలివిడతగా 505 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ప్రాథమిక అక్షరాభ్యాసం, సంఖ్యాపరిజ్ఞానం, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత తదితర విషయాలను నేర్పించేందుకు మండలంలోని 50మంది వెలుగు వీవోఏలకు ఒక్కరోజు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వయోజనవిద్యా సూపర్‌వైజర్ షేక్ బాదుల్లా వీరికి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఓపెన్ పాఠశాలల ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1,2 రవికుమార్, ఆనందరావు, ఏపీఎమ్ కాంతారావు పాల్గొన్నారు.

● కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఈవో గోవిందయ్య తెలిపారు. పట్టణ మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో శనివారం నిరక్షరాస్యత నిర్మూలనపై ఏపీఎం కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ముఖ్యఅతిథులుగా ఎంఈవో గోవిందయ్య, ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, కృపమ్మ, సీసీలు ఎస్‌కె. రసూల్, శివయ్య, చిరంజీవి, ఎన్.మాల్యాద్రి, మండల సమాఖ్య సిబ్బంది సుమతి పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): నూరుశాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం వయోజన విద్య ఏర్పాటుపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 38వయోజన విద్యాకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ సింహాద్రి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ముప్పా హరిత, ఎంఈఓ-2 మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత, గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. వెంకట్రావుపల్లి పాఠశాల ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అపార్ ఐడీలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. మనబడి-మన భవిష్యత్తు నిధులు విడుదల కాగానే వెంటనే పనులు పూర్తిచే యాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, రిజిస్టర్లు పరిశీలించి తగు సూచనలు అందజే శారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బలరాం, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.24/2023
వల్లూరి లక్ష్మమ్మ .. వాది
Vs
సోమినేని బ్రహ్మయ్య మరియు వగైరాలు ... ప్రతివాదులు,
D7: బండి కోటేశ్వరమ్మ W/o. వెంకటేశ్వర్లు, బండివారిపాలెం గ్రామం, వలేటివారిపాలెం, SPSR నెల్లూరుజిల్లా.
పై నెంబరు దావాలోని పరిహారం డిక్రీ కోరి మీ మీద వాది దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ, మీ నుంచి సంపూర్ణ సంజా యిషీ పొందిన లాయరు ద్వారా కాని సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందులకు తే:05-11-2024దికి వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి మొదటి హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేది యందు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షముందు పై దావాను తీర్మానించిందరు.
వాయిదా: 05-11-2024
శ్రీ టి.గోపాలకృష్ణమూర్తి
వాది తరపు న్యాయవాది
కందుకూరు

గుంతల రోడ్ల నుంచి విముక్తి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై ప్రయాణించిన ప్రజలు నరకాన్ని చూశారని, కూటమి ప్రభుత్వంలో చేపట్టిన రోడ్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలతో విముక్తి పొందనున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానం ఎదుట రోడ్డు మరమ్మతు పనులను కలెక్టర్ ఓ ఆనంద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం సరికొత్తగా తీసుకుని గుంతల రహిత ఏపీ నినాదంతో రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చి వీలైన చోట్ల నూతన నిర్మాణాలు చేపట్టి ప్రజలకు సుఖవంతమైన ప్రయాణం అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగన్ సర్కారులో రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు హడలెత్తిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసిన గుంతలే కనపడేవని, రోడ్లపై గతుకులు వస్తే ఏపీ వచ్చిందని చెప్పుకునే వారన్నారు. ఈ దుస్థితి నుంచి చంద్రబాబు ప్రజలకు విముక్తి కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ చెక్క అహల్య, నాయకులు సాయిసునీల్, దామోదర్, దొరబాబు, శాంతినాయుడు, రాజానాయుడు పాల్గొన్నారు.



రోడ్డుపై ప్యాచ్ వర్కును పరిశీలిస్తున్న కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే

ఇసుక హద్దులు దాటితే చర్యలు

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను జిల్లా సరిహద్దుదాటిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, ఎస్‌ఐ. శివ రాకేష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో దొరికే ఇసుక, మట్టి, గ్రావెల్ వంటి వాటిని అవసరాలకు ఉపయోగించుకోవాలే తప్ప వ్యాపారం చేయరాదన్నారు. అలాగే రేవుల నుంచి వచ్చే ఇసుక జిల్లా సరిహద్దులు దాటించాలంటూ తప్పనిసరిగా అధికారుల అనుమతి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనువాసులు పాల్గొన్నారు.

బంజారాలకు చోటు కల్పించాలి

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలిలో బంజారా(ఎస్టీ)లకు చోటు కల్పించాలని తెలంగాణ కాంగ్రెస్ (మహబూబాబాద్) ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని శనివారం తిరుగుప్రయాణంలో మనుబోలు సమీపంలోని ఓ హోటల్ వద్ద ఆగారు. అక్కడ మీడియాతో మాట్లాడారు. తిరుమలలో హథీరాంజీ మఠం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గుర్తుచేశారు. ప్రతిసారి తిరుమలకు వచ్చినప్పుడల్లా ఈ పరిసరాల్లో ఆగుతుంటానని తెలిపారు.

నిత్యాన్నదాన నిలయం.. పొదలకూరు అయ్యప్ప పీఠం

● డిసెంబరు ఒకటి వరకు అన్నప్రసాద వితరణ ● దాతల సాయంతో నిర్వహణ

పొదలకూరులోని శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పపీఠంలో మాలధారణ చేసిన అయ్యప్పలకు, అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో శనివారం అన్నప్రసాద వితరణ ప్రారంభమైంది. డిసెంబరు ఒకటి వరకు దాతల సహకారంతో ఇక్కడ బిక్ష అందచేస్తారు. మాల ధరించినవారు ఎక్కడపడితే అక్కడ బిక్ష (భోజనం) స్వీకరించరాదు. ఈ క్రమంలో కొందరు స్వాములు పనుల్లో పడి సకాలంలో బిక్ష చేయలేని పరిస్థితులను గమనించిన స్థానిక అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు కార్తీక మాసం పూర్తయ్యే వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం బిక్ష అందచేస్తారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ, గోవింద, తదితర మాల ధారులు సుమారు 200 మంది నుంచి 250 మంది వరకు ప్రతిరోజు బిక్ష స్వీకరిస్తారు. శనివారం కార్యక్రమానికి ఉభయకర్తలుగా అడపాల మస్తాన్‌రెడ్డి, ఐతా రవి, జనకల శ్రీనివాసులు, ఇండ్ల రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాజం గౌరవ అధ్యక్షుడు శివాడి పరంధామిరెడ్డి, ముత్తు కృష్ణ, వీరేపల్లి శ్రీనివాసులు, అధ్యక్షుడు మొలబంటి శేఖర్, ఉపాధ్యక్షుడు కోటపాటి కృష్ణమనాయుడు, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వర్లు, ట్రెజరర్ అడపాల మస్తాన్‌రెడ్డిలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మండలం పాటు (40 రోజులు) నిర్వహించేలా చూస్తామన్నారు. ఇందుకు భక్తులు, దాతలు సహకరించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

-పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

జొన్నవాడ ఆలయంలో ఆకాశదీపం



జొన్నవాడ ఆలయంలో వెలిగించిన ఆకాశదీపం

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో ఆకాశదీపాన్ని అర్చకులు వెలిగించారు. ముందుగా వేదపండితులు, అర్చకుల వేదమంత్రాలు, మంగళమేళాల మధ్య శాస్త్రోక్తంగా కార్తీక మాస పూజలు నిర్వహించి ఆకాశదీపం వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మురళి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘ఉల్లాస్’పై అవగాహన

పొదలకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయం ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీసు సమావేశ మందిరంలో శనివారం వలంటరీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఈన్ సొసైటీ) (యూఎల్‌ఎల్‌ఏఎస్) (ఉల్లాస్)లో భాగంగా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఏపీఎం చిన్నయ్య, ఎంఈవో శకుంతల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● ఉల్లాస్‌పై శిక్షణ

సైదాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోని పెద్దలకు చదువు చెప్పడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా చదువుకోని పెద్దలకు చదవడం, రాయడం నేర్పేందుకు వివోఏలు, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో మురళి, ఏపీఎం బీఎల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని తగ్గించేందుకే..

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు2(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా నైపుణ్య గణన సర్వేను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శ్రీహరి తెలిపారు.శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయాల సిబ్బందికి సర్వేపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, ఎంపీపీ, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో రూ.30కోట్లతో పనులు : సోమిరెడ్డి

మనుబోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్వే పల్లిలో రోడ్లు, వంతెనల కోసం రూ. 30కోట్లతో పనులను ప్రతిపాదిం చామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మనుబోలు-పొదలకూరు మార్గంలో దెబ్బతిన్న రహదారిని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో రోడ్ల గురించి పాలకులు పట్టిం చుకోలేదన్నారు. మడమనూరు జగనన్న లేఅవుట్ వద్ద భారీ గుంతలో పడి తగ జనవరిలో బీజేపీ మా జీ మండలాధ్యక్షుడు చనిపోవడం బాధాకరమన్నా రు. సర్వేపల్లిలో రూ. 123కోట్ల సీఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరామన్నారు. మనుబోలు-పొదలకూరు రోడ్డులో 10కి.మీ మేర ప్యాచ్ వర్కులకు రూ. 10లక్షలతో పనులు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ సురేఖ, టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, రామకృష్ణయ్య, మస్తాన్ నాయుడు, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.



ప్యాచ్ వర్కులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

● పొదలకూరు (ఆంధ్రజ్యోతి): రైతుల భాగస్వామ్యంతోనే పంట కాలువల్లో పూడికతీత చేపడతామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పొదలకూరు మండలం తాటిపర్తి, సూరాయపాలెం గ్రామాల్లో కనుపూరు కాలువ పూడికతీతను అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల తరువాత పంట కాలువల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. పనులు పారదర్శకంగా ఉండేందుకే రైతులను భాగస్వాములను చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.27 కోట్లతో ఓఅండ్ఎం పనులు చేపట్టామ న్నారు. మాజీ మంత్రి కాకాణి సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టు పట్టించారన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం

వెంకటాచలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవం సందర్భంగా అవినీతి నిర్మూలనపై అవగా హన పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సత్య నిష్ఠతో ఉండి అవినీతి నిర్మూలనలో భాగస్వామ్యం కావాల న్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, ఎస్ శిరీష్, సీహెచ్ విజయ, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ సీఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

బీద రవిచంద్రతో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ భేటీ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధా న కార్యదర్శి బీద రవిచంద్రను మాగుంట లే అవుట్‌లోని వారి నివాసంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీని బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు సన్మానించారు.

రేపు సర్వసభ్య సమావేశం

సింహపురి కార్తీక దీపోత్సవ కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల ఒక ప్రకటనలో తెలిపారు.

8 నుంచి కార్తీక దీపోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3రోజులపాటు జరిగే లక్ష దీపోత్సవాన్ని వీఆర్సీ మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశేష పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు, స్వామీజీల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. నెల్లూరు ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని సర్వేశ్వరుని కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

ఆటో స్టాండు స్థలం ఆక్రమణ

విడవలూరు (ఆంధ్రజ్యోతి): రామతీర్థం పంచాయతీ పరి ధి పొన్నపూడి సెంటర్‌లో ఉన్న ఆటో స్టాండు స్థ లం ఆక్రమణకు గురైంది. తమకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైయిందని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆటో కార్మి కులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



అక్రమణకు గురైన ఆటోస్టాండు స్థలం

● 2007లో ప్రారంభం

పొన్నపూడి సెంటర్ నుంచి నెల్లూరు, విడవ లూరు, ఊటుకూరు, రామచంద్రాపురం పంచాయతీలకు నిత్యం ప్రజలు ఆటోల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఆటో స్టాండు కోసం 10 అంకణాల స్థలాన్ని పంచాయతీ, దేవదాయశాఖ వారి అనుమతితో 2007లో ప్రారంభించారు. అయితే రాజకీయ నేతల అండదండలతో గ్రామా నికి చెందిన కొంతమంది రూ. లక్షలు విలువ చేసే ఆ స్థలాన్ని అక్రమించుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించారు. దీంతో ఆటోలు నిలుపుకోనేందుకు స్థలం లేక కార్మికులు రోడ్డుపైనే పార్కింగ్ చేసుకుంటు న్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతున్నది.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి

పొన్నపూడి సెంటర్‌లో ఉన్న స్థలం అక్రమ ణకు గురికావటంతో ఆటోలు నిలిపేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విష యమై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- మల్లికార్జున, ఆటో కార్మికుడు

జాతీయ స్థాయి సదస్సులో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు(విద్య), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ విభాగం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జీ.దత్తాత్రేయశర్మ తెలిపారు. నగరంలోని కళాశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జేఎన్‌టీయూ పులివెందులలో జరిగిన పోటీల్లో ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో కేవీ.సాయితేజ, వంశీ, జహీర్, కార్తిక్‌లు ప్రథమ, పోస్టర్ ప్రజంటేషన్‌లో కేవీ.సాయితేజ, జహీర్‌లు ద్వితీయస్థానం సాధించారన్నారు. అలాగే జేఎన్‌టీయూ అనంతపురంలో జరిగిన పోటీల్లో పోస్టర్ ప్రజంటేషన్‌లో కే.విష్ణు, కృష్ణలు ప్రథమ, బాలాజీ, విజయకుమార్, సుభాష్‌లు ద్వితీయ స్థానం, టెక్నికల్ క్విజ్‌లో పీ.సాయిసుందర్ ప్రథమ, ప్రొడక్ట్ ఎక్స్‌పోలో అబ్దుల్ రఫీ, మేఘవర్షిత, హరనాథ్, సుభాష్‌లు ద్వితీయస్థానం సాధించారన్నారు. అందరి సమష్టి కృషితోనే ఈ విజయాలు సాధించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్‌కుమార్, సిబ్బంది జీవీ.నాగమణి, వీ.రవీంద్ర, యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో శివ దీక్షల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మూలాపేట మూల స్థానేశ్వర ఆలయంలో శనివారం ఉదయం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్‌ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అల్తూరి గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 15వ శివ దీక్ష మాలా ధారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మూలస్థానేశ్వరస్వామికి, భువనేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ కా ర్యక్రమానికి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దుస్తులు, మాలలు అందజేశారు. అనంతరం గిరీష్‌రెడ్డి, ఆలయ ఈవో జేవీ.శ్రీనివాసరావులు శివ మాలాధారణ చేశారు. అనంతరం శివ భక్తులకు దుస్తులు, దీక్ష మాలాధారణ ఆలయ ప్రధాన అర్చకులు చేతుల మీదుగా జరిగింది. శివ దీక్ష భక్తులు ఉదయం శివ భజనలు, రాత్రి శివ భజనలు చేస్తారని రాత్రి భిక్షగా అల్పాహారం అందజేస్తున్నట్లు గిరీష్‌రెడ్డి ప్రకటించారు.



శివ భక్తులకు దుస్తులు అందజేస్తున్న రూప్‌కుమార్, గిరీష్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలకు కృషి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్



నెల్లూరు (వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అనేక సంస్కరణలు తీసుకువస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ వెల్లడించారు. జిల్లాలో అనేక ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నప్పటికీ చికిత్స కోసం ఎక్కువగా నగరంలోని జీజీహెచ్‌కే వస్తుంటారని అలాంటి రోగులకు అన్ని విధాలుగా వైద్య చికిత్సలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలియ చేశారు.

? : జీజీహెచ్‌లో వైద్య సేవలపై అనేక విమర్శలున్నాయి.. మీరేమంటారు

! : విమర్శలు ఉన్నమాట వాస్తవమే. అయితే వాటిని అధిగమించి అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నాం. రోజుకు 1500 మంది రోగులు జీజీహెచ్‌కు వస్తుంటారు. అందులో 600 మందికిపైగా ఇన్‌పేషెంట్లుగా చికిత్సలు పొందుతుంటారు. వారికి అత్యుత్తమ చికిత్సలు అందిస్తున్నాం.

? : కొన్ని రకాల మందులు లేవంటు న్నారు. నిజమేనా

! : ఆసుపత్రిలో కొన్ని రకాల మందులు లేని మాటనిజమే. అత్యవసర మందులు కొనుగోలు చేస్తున్నాం. వ్యాధిగ్రస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

? : ప్రమాద బాధితులకు వైద్య చికిత్సలు ఎలా ఉన్నాయి.

! : నగరం పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల జరిగే రోడ్డు ప్రమాద బాధితులు ఆసుపత్రికి వచ్చిన వెంటనే చికిత్సలు అందిస్తున్నాం. ఎవరికైనా సీరియస్‌గా ఉంటే వారిని ప్రైవేట్ ఆసుపత్రికి సిఫార్సు చేస్తుంటాము. వ్యాధిగ్రస్తుని ఆరోగ్యం మెరుపడేందుకే కృషి చేస్తుంటాము.

? : స్పెషాలిటీ వైద్యుల మాటేమిటి.

! : ఆసుపత్రిలో స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్క గుండె వైద్యం మినహా మిగిలిన వైద్య చికిత్సలు అందిస్తున్నాం. న్యూరో సర్జన్, ఫిజీషియన్, యురాలజీ వైద్య నిపుణులు ఉన్నారు. గుండె వైద్య నిపుణులు త్వరలో వస్తారు.

న్యూస్ బాక్స్

తప్పుల దిద్దుబాటుకే సదస్సులు

విడవలూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో జరిగిన తప్పులు సరిదిద్దటానికే టీడీపీ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని పార్లపల్లి సర్పంచు రామిశెట్టి స్వాతి తెలిపారు. గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో అమె మాట్లాడారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ విజయకుమార్, ఆర్‌ఐ సలాం, సర్వేయర్ మస్తాన్‌భాష, టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలి : సీపీఎం



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరురూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్తగా ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరిట ఆర్థిక భారాన్ని వేయడానికి సిద్ధమైందని, దీనిని సర్కారే భరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సౌత్‌మోపూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, ఎంవీ రమణ, శ్రీపతి వెంకయ్య, జానా లక్ష్మీప్రసాద్, బాలు ఆదిశేషయ్య, పాదర్తి మస్తానయ్య పాల్గొన్నారు.

నేడు రంగనాథుడికి తైల సమర్పణ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు శ్రీరంగనాథస్వామి మూల విగ్రహానికి తైల సమర్పణ కార్యక్రమం జరుగుతుందని అలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్వామివారిని భక్తులు అందరూ దర్శించుకోవాలని పేర్కొన్నారు.



భోజన ప్రియుడు తిరుమల వెంకన్న



- వివరాలు 6వ పేజీలో -



శ్రీవారి దర్శనంతో అద్భుతమైన అనుభూతి

● ప్రముఖ నటి హేమమాలిని

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): సీనియర్ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని తన కుమార్తె ఈషాతో కలసి శనివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి వారు ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం హేమమాలిని ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలకు రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.తిరుమలలో పరిశుభ్రత, ప్రకృతి అందాలు అద్భుతంగా ఉంటాయన్నారు. తాను చాలా సార్లు శ్రీవారిని దర్శించుకున్నానని, ఈసారి మరింత అద్భుతమైన అనుభూతి కలిగిందన్నారు.ఈషా దేవోల్ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను చాలా సార్లు తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఈసారి తన తల్లితో దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కొండ కిటకిట

తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. గురు, శుక్రవారాల్లో ఖాళీగా కనిపించిన కొండ శనివారం కిక్కిరిసింది. అలిపిరి నుంచి శ్రీవారి ఆలయం వరకు ఎక్కడ చూసినా భక్తులే కనిపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



పసిమొగ్గను చిదిమేసిన మానవ మృగం

ముక్కు పచ్చలారని ఓ చిన్నారి బతుకును చిదిమేసిందో మానవమృగం. కన్నూమిన్నూ కానక ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడి అమానుషంగా హత్యచేసిన వైనంతో జిల్లా ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెక్కాడితే గాని డొక్కాడని ఓ పేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ అమానవీయ ఘటనపై తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. కేవీబీపురం మండలానికి చెందిన నిరుపేద దంపతులకు బాబు, పాప ఉన్నారు. పాపకు మూడేళ్లు. ఉన్న ఊరిలో బతకడానికి సరైన దారిలేక ఈ మధ్య భార్య పుట్టిన వడమాలపేట మండలానికి వచ్చారు. అక్కడే కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు.

- పుత్తూరు అర్బన్, కేవీబీపురం, వడమాలపేట (ఆంధ్రజ్యోతి)



- ● మూడేళ్ల చిన్నారిపై రాక్షసకృత్యం
- ● లైంగికదాడిచేసి అమానుషంగా హత్య
- ● నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు
- ● రూ.10లక్షలు ప్రకటించిన ప్రభుత్వం
- ● నేడు చిన్నారి తల్లిదండ్రుల పరామర్శకు హోంమంత్రి
- ● దారుణ సంఘటనపై సర్వత్రా ఆగ్రహం



సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఆనందం అంతలోనే ఆవిరి

శుక్రవారం పిల్లలతో దీపావళి పండుగ జరుపుకోవాలని ఆ దంపతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. చిన్నారి తండ్రి తనకున్న ఆర్థిక స్థోమత మేరకు బాణసంచా తెచ్చాడు. తర్వాత పొరుగూరికి వెళ్లాడు. ఇంతలోనే చిన్నారి కనిపించడం లేదంటూ అతనికి భార్య తల్లి ఫోన్ చేసింది. బాగా వెతుకు.. భయపడవద్దంటూ ఫోన్‌లోనే ధైర్యం చెప్పాడు. వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఊరంతా బాలిక కోసం జల్లెడ పట్టారు. అయినా కనిపించకపోయేసరికి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన సుశాంత్ చిన్నారిని తీసుకెళ్లాడని గుర్తుకు తెచ్చుకున్నారు. అతడిని ఆరా తీసినా తనకేమీ తెలియదంటూ బుకాయించాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సుశాంత్‌ను విచారించేసరికి ఘాతుకం బయటపడింది.

ఈ మానవమృగం బంధువే

ఈ దంపతులకు దగ్గర బంధువైన యువకుడు సుశాంత్(22) ఇటీవల బెంగళూరు నుంచి కాలనీలో ఉంటున్న పెదనాన్న ఇంటికి వచ్చాడు. కొన్ని రోజులుగా పనులకు వెళ్లకుండా మద్యం తాగుతూ ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సుశాంత్ చాక్లెట్ ఆశ చూపించి చిన్నారిని తనతో తీసుకుపోయాడు. ఎవరూ లేని ప్రదేశంలో లైంగిక దాడికి పాల్పడి దారుణంగా హతమార్చి మురికికాల్వలో పూడ్చేశాడు. తమ గారాలపట్టి కనిపించకపోయే సరికి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కొన్ని గంటల తర్వాత తెలిసిన దుర్మార్గుడి ఘాతుకంతో నిశ్చేష్టులయ్యారు.

అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే భానుప్రకాష్

చిన్నారిని హత్యాచారం ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పుత్తూరు, వడమాలపేట మండలాల నాయకులు గంజి మాధవయ్య, ధనంజయులునాయుడు, లోకరాజు, జీవరత్నం నాయుడు, కరుణాయాదవ్, షణ్ముగరెడ్డి, తదితరులు ఓదార్చారు. చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రాజన్ రూ.20 వేలు, పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. సంఘటనను ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి రోజాతో పాటు వైసీపీ నాయకులు నారాయణస్వామి, కరుణాకరరెడ్డి, మునివేలు, జయప్రకాష్, చిన్నా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



బాలిక అంతిమయాత్ర

ఊరంతా విషాదం

నిందితుడు సుశాంత్‌ను అరెస్టు చేసి, చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం పుత్తూరులో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి చేర్చారు. చిన్నారి మృతదేహాన్ని చూసి ఊరంతా కన్నీటిపర్యంతమయ్యారు.

కాలనీ విషాదంలో మునిగిపోయింది. చిన్నారి తల్లి స్పృహతప్పి పడిపోయింది. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. గ్రామస్తులే చిన్నారికి అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామంలో సీఐ భాస్కర్‌నాయక్, ప్రత్యేక పోలీసు దళం, కేవీబీపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిందితుడు సుశాంత్

నేడు హోం మంత్రి రాక

నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం రానున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షలను ఆమె అందజేయనున్నారు. ఇది హేయనీయమైన చర్యగా అనిత అభివర్ణించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్షపడేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కేసును చాలా తీవ్రంగా పరిగణించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రభుత్వ స్పందన, సంఘటన తీవ్రతను గుర్తించిన జిల్లా అధికారులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రామ్మోహన్ తదితరులు చిన్నారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సాయంగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలను సేకరించారని ఎస్పీ చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా, పీడీ ట్రైల్ చేసి కఠిన చర్యలు చేపడతామన్నారు. కాగా చిన్నారిని అమానుషంగా హత్యచేసిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ గ్రామస్తులు, బంధువులు ఎస్పీ సుబ్బారాయుడు ఎదుట వాపోయారు. గ్రామానికి వచ్చిన ఎస్పీ వద్ద వారంతా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.



మహిళల కళ్లలో ఆనందం కోసమే దీపం పథకం

ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడిన మహిళల కళ్లలో ఆనందం కోసమే దీపం పథకం తీసుకొచ్చినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో శనివారం లబ్ధిదారులకు దీపం పథకం కింద మంత్రి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉచిత సిలిండర్లు బుక్ చేసిన వెంటనే ఇంటి వద్దకు వస్తుందన్నారు. ధర చెల్లించిన 24 గంటల్లోనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమవుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు ఇన్‌చార్జి నరసింహయాదవ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్ల రాక్షస పాలనలో మహిళలు అభద్రతా భావంతో బతికారని, ఇప్పుడు స్వేచ్ఛగా ఉంటున్నారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ అర్హత ఉండి ఉచిత సిలిండర్ అందకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కమిషనర్ మౌర్య, టీడీపీ తిరుపతి నేత ఆరణి శివ మాట్లాడారు. అనంతరం మంత్రి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ బాయ్స్‌తో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, జనసేన జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి శ్రీధర్ వర్మ, కూటమి నాయకులు ఊకా విజయ్‌కుమార్, కిరణ్‌రాయల్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రేవతి, నారాయణ, పుష్పావతి, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరాం, సింగం శెట్టి సుబ్బరామయ్య, శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, అజయ్‌కుమార్, వరప్రసాద్, ఆకేపాటి సులోచన, డీఎస్‌వో శేషాచలం రాజు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సిలిండర్ అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అర్ధరాత్రి రుయాలో హల్‌చల్

- ● మద్యం మత్తులో కారులో దూసుకువచ్చిన యువకులు
- ● అడ్డుకున్న పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి యత్నం



డివైడర్‌ను ఢీకొట్టిన కారు - గాయపడిన మునిశేఖర్

తిరుపతి(వైద్యం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు అతివేగంగా కారు నడుపుతూ రుయాస్పత్రిలోకి దూసుకొచ్చిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తాతయ్యగుంటకు చెందిన దాము, మునిశేఖర్ పూటుగా మద్యం తాగి కారులో వేగంగా రుయాస్పత్రిలోకి దూసుకెళ్లారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన సెక్యూరిటీ సిబ్బందిని లెక్క చేయకుండా ముందుకు వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టారు. ఆ సమయంలో అక్కడ రోగులు, సహాయకులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారు డివైడర్‌ను ఢీకొట్టిన శబ్దానికి అక్కడున్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అవుట్ పోస్టులోని పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా కారులో పక్క సీట్లో కూర్చున్న మునిశేఖర్ తలకు గాయం కాగా నడుపుతున్న దాముకు స్వల్ప గాయాలయ్యాయి. కారును అక్కడే విడిచిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు వాగ్వాదానికి దిగారు. దాడి చేసేందుకు తెగబడ్డారు. అదుపులోకి తీసుకొని వెస్ట్ పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లిన గంట వ్యవధిలోనే ఆ ఇద్దరు యువకులు తిరిగి రుయాస్పత్రికి చేరుకుని 'మమ్మల్నే పోలీసులకు పట్టిస్తారా.. మీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది వారికి నచ్చజెప్పి పంపించారు. డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలాజీ డివిజన్ కల ఫలించేనా?

◆ రైల్వే ప్రాజెక్టులపై రేపు పార్లమెంటరీ కమిటీ సమావేశం

తిరుపతి(సెంట్రల్) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో గ్రేడ్-1 రైల్వేస్టేషన్లలో తిరుపతి ఒకటి. అయితే ఇక్కడ బాలాజీ డివిజన్ ఏర్పాటు కలగానే మిగిలింది. సోమవారం తిరుపతిలో రైల్వే ప్రాజెక్టులపై జరగనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశంలో దీనిపై చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ● తిరుపతి-రేణిగుంట మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలి.
- ● రేణిగుంట జంక్షన్‌ను మరో టెర్మినల్ చేయాలి.
- ● బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి.
- ● చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- ● సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాలి.
- ● తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- ● పాకాల జంక్షన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి.



ఆదివారం ప్రత్యేకం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అలంకార ప్రియుడే కాదు, మంచి భోజన ప్రియుడు కూడా. ఈ తరం మాటల్లో చెప్పాలంటే మంచి ఫుడీ. కాకపోతే పిజ్జాలు, బర్గర్ల రకం కాదు. ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే స్వామి స్వీకరిస్తాడు. పోషక విలువలు మెండుగా ఉన్న ఆహారమే స్వామి నైవేద్యం. మనలాగే స్వామి కూడా రోజుకు మూడు పూటలు విభిన్నమైన ఆహారపదార్థాలు తీసుకుంటాడు. ఎప్పుడు పడితే అప్పుడు, ఏదిపడితే అది స్వామి స్వీకరించడు. ప్రాతఃకాలంలో, మధ్యాహ్న, రాత్రి సమయాల్లో స్వామికి నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యాల విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం!

భోజన ప్రియుడు

ప్రత్యేక కథనం

ఆంధ్రజ్యోతి, తిరుమల





తిరుమల ప్రసాదం అనగానే లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. నిజానికి 50 రకాల ప్రసాదాలను వెంకన్న స్వామికి నివేదిస్తారు. రోజూ సమర్పించేవి కొన్ని అయితే, వారానికో రోజు పెట్టేవి కొన్ని ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాల రోజుల్లో సమర్పించే నైవేద్యాలు మరికొన్ని. మూలమూర్తికి సమర్పించేవి కొన్ని అయితే, మలయప్పస్వామికి నివేదించేవి మరికొన్ని ఉంటాయి. ప్రసాదాలను శ్రీవారి ఆలయంలోని పోటులోనే తయారు చేస్తారు. పోటులో ఈ వంటకాలను శ్రీనివాసుడి మాతృమూర్తి వకుళాదేవి పర్యవేక్షిస్తారని నమ్ముతారు. వీటిల్లో చాలా పరిమితమైన నైవేద్యాలు మాత్రమే భక్తులకు అందుతాయి. విక్రయించరు కాబట్టి వీటి గురించి చాలా మందికి తెలియదు.

సుప్రభాత సమయంం: నవనీతం, గోక్షీరంతో తయారు చేసిన పదార్థాలను స్వామికి నివేదిస్తారు.

తోమాలసేవ తరువాత కొలువు ప్రసాదం: నల్ల నువ్వులు, బెల్లంతో చేసిన ఈ ప్రసాదాన్ని 'కొలువు పిండి ప్రసాదం' అంటారు. 'నువ్వుల చిమ్మిరి' అన్నమాట.

మొదటి గంట

ఉదయం 5.30 గంటలకు మీగడ, వెన్న, పెరుగుతో చేసే 'మాతృ దద్యోధనం' స్వామికి సమర్పిస్తారు.మాత్రన్నం (వెన్న, ఇంగువ, ఉప్పుతో చేసిన ప్రసాదం), శుద్దన్నం, చక్కెర పొంగలి, ఉప్పుపొంగలి, పులిహోర, కదంబం, దద్యోధనం కూడా స్వామికి నివేదిస్తారు.

రెండవ గంట

పొద్దు బాగా పైకొచ్చిన తర్వాత 10 గంటలకు నాదూకం, లడ్డూ, దోశ, వడ, అప్పం నివేదిస్తారు. సేకరాబాత్ పెడతారు.

అష్టోత్తరశత నామార్చన: ఉదయం 9.45 గంటలకు శుద్ధన్నం, సీరా నివేదిస్తారు.

రాత్రి గంట

7.30 తర్వాత మరీచాన్నం(మలహోర), ఉడాన్నం (బెల్లం పొంగలి), కదంబం, శుద్దన్నం, దద్యోధనం, పులిహోర, అమ్మవారి పాయసం(పలచగా వుండే చక్కెర పొంగలి), తోమాల దోసె, సీరాలను నివేదిస్తారు

రాత్రి విశ్రాంతి సమయంలో: పాయసాన్నం నివేదిస్తారు. పడుకోబోయే ముందు.. డ్రై ఫ్రూట్స్ పాలు, పండ్లు నివేదిస్తారు.



రోజూ పెట్టే ప్రసాదాలు చిత్రాన్నం, దద్యోధనం, క్షీరాన్నం, కదంబం, పాయసాన్నం.

వార నివేదనలు ● **ఆదివారం నాడు** బియ్యపు పిండి, బెల్లం, నెయ్యితో ప్రత్యేకంగా తయారు చేసే అమృత కలశం ప్రసాదంగా పెడతారు. పానకం సమర్పిస్తారు. ● **మంగళవారం** అష్టదళం తర్వాత సీరా, వడపప్పు, పానకం సమర్పిస్తారు.● **గురువారం** తిరుప్పావడలో పులిహోర, పిట్టు, జిలేబి, మురుకులను నైవేద్యంగా పెడతారు. రెండు గంగాళాల పాయసాన్ని కూడా నివేదిస్తారు. పానకం సమర్పిస్తారు. ● **శుక్రవారం** అభిషేకం తర్వాత బెల్లం పాయసం, పోలీలు, పానకం నివేదిస్తారు.

మాత్రాన్నం

రోజూ మొదటిగంటకు రెండు గంగాళాల మాత్రాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు.

మలహోర: రోజూ రాత్రి గంటకు రెండు గంగాళాల మలహోరను నివేదిస్తారు.





తోమాలదోశ: రాత్రి నైవేద్యంగా ప్రతి రోజు 51 దోశలను సమర్పిస్తారు.



మేవా: ఏటా మూడురోజుల పాటు జరిగే వసంతోత్సవాల సందర్భంగా వివిధ రకాల పండ్ల రసాలతో ఈ ప్రసాదాన్ని తయారు చేసి సమర్పిస్తారు.

గరుడసేవ ప్రత్యేకం మనోహరం: గరుడసేవ రోజు పెద్ద మనోహరం, రథోత్సవం రోజున చిన్న మనోహరం ప్రసాదంగా స్వామికి పెడతారు.

వరలక్ష్మీవ్రతం రోజున: శనగపిండితో చేసిన సుగీలను తయారు చేసి స్వామికి నివేదిస్తారు. పెసరపప్పుతో చేసిన సుగీలను జీయంగార్ల మఠానికి పంపుతారు.

గుగ్గిళ్లు: రోహిణి నక్షత్రం రోజున, ఏకాదశి, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో పప్పు శనగ గుగ్గిళ్ల స్వామికి నైవేద్యంగా పెడతారు. ధనుర్మాసంలోనూ రోజూ మొదటి గంటలో గుగ్గిళ్ల నివేదిస్తారు.





సేకరాబాత్ : ప్రసాదాన్ని రెండవ గంటలో ఓ గంగాళాన్ని నివేదిస్తారు.



పోలీ: శుక్రవారం ఉదయం తొలి గంటకు 102 పోలీలను సమర్పిస్తారు.



బెల్లం పొంగలి: గురువారం మినహా రోజూ నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.

పులిహోర: రోజూ నాలుగు గంగాళాలు. గురువారం మాత్రం తిరుప్పావడ సందర్భంగా అదనంగా 450 కేజీలు తయారు చేసి సమర్పిస్తారు.



దధ్యోదనం: రోజూ ఎనిమిది గంగాళాలు చేస్తారు. గురువారం మాత్రం మూడు గంగాళాలు నివేదిస్తారు.



కదంబం: శని, ఆదివారాల్లో 16, మిగిలిన రోజుల్లో ఎనిమిది గంగాళాలు సమర్పిస్తారు.

మిరియాల పొంగలి: ప్రతిరోజు నాలుగు గంగాళాలు సమర్పిస్తారు.







జిలేబి: గురువారం రోజున జరిగే తిరుప్పావడ సేవ సందర్భంగా జిలేబీ, మురుకులను తయారు చేస్తారు. ఏడు పడులు అంటే దాదాపు 350 జిలేబీలను తయారుచేసి స్వామికి నివేదిస్తారు.

అమృతకలశం: ఆదివారం మాత్రమే ఈ ప్రసాదాన్ని ప్రత్యేకంగా ఒక గంగాళానికి తయారుచేసి సమర్పిస్తారు.




గర్భాలయంలోకి వెళ్లే ప్రసాదాలు: లడ్డూ, వడ, సుద్దాన్నం, మాతృ ప్రసాదం. రోజూ క్యూలైన్లలో దర్శనానికి వచ్చే భక్తులకు పులిహోర 60 గంగాళాలు, పొంగలి 60 గంగాళాలు అదనంగా తయారు చేసి వితరణ చేస్తారు.

స్వామికి సద్దెన్నం: మాతృప్రసాదం అంటే మనం తినే సద్దెన్నం వంటిదే. స్వామివారు భూలోకానికి వచ్చినప్పుడు వకుళమాత ఈ ప్రసాదం పెట్టేదట. రాత్రి మిగిలిన అన్నంలో పాలు, చేమిరి వేసి పెట్టి.. ఉదయాన్నే కుమారుడికి పెట్టేదంట. అందుకే దీనికి మాతృప్రసాదం అని పేరు వచ్చిందంటారు.







హత్యకేసులో నిందితుల అరెస్టు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు అరుంధతివాడ వెంకటేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కడివేడు అరుంధతివాడకు చెందిన వెంకటేష్, పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం మధ్య పాత గొడవలున్నాయి. ఇటీవల స్వల్ప వివాదం రాగా సుబ్రహ్మణ్యంతో పాటు అతని స్నేహితులైన సాయికుమార్, సునీల్‌ను వెంకటేష్ బెదిరించాడు. దీంతో వెంకటేష్‌ను చంపాలని వారు పథకం పన్నారు. అక్టోబర్ 31వ తేదీన వెంకటేష్ మరో ఇద్దరితో కలిసి గ్రామానికి చెందిన బాస్కర్ ఇంట్లో మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో సునీల్ వెంకటేష్ కళ్లలో కారం పొడి చల్లగా సుబ్రహ్మణ్యం, సాయికుమార్ ఐరన్ రాడ్డు, సుత్తితో దాడి చేశారు. వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి గోపాలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కోట క్రాస్ రోడ్డు సమీపంలో సుబ్రహ్మణ్యం, సాయికుమార్, సునీల్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది రాజు, విష్ణు, బాస్కర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణకుమార్



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 32వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,792మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,058మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,612మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,141, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 304మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 240మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 55మంది భక్తులు పూజలు చేయించారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,682 అమ్ముడైనట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ హుస్సేన్‌బాషా

తండ్రి హత్య కేసులో తనయుడి అరెస్టు

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో తండ్రిని చంపిన కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గతనెల 31వ తేదీన తుపాకుల రమేష్ తన తండ్రి చిన్నరామయ్యను హత్యచేసిన విషయం విదితమే. మద్యం మత్తులో తలపై కర్రతో కొట్టడంతో చిన్నరామయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పరారైన రమేష్‌ను శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

సముద్ర ముఖద్వారాల పరిశీలన

వాకాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు, కొండూరు పాళెం సముద్ర ముఖద్వారాలను శనివారం మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ప్రత్యేక అధికారులతో కలసి పరిశీలించారు. శంకర్ మాట్లాడుతూ రూ.97కోట్లతో పూడిరాయదొరువు వద్ద పులికాట్ సరస్సులోని ముఖద్వారాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం వద్ద ఉన్న ముఖద్వారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తీర ప్రాంతాల్లోని గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగునకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రఘుబాబు, రెడ్యానాయక్, డీఎఫ్‌ఏ తదితరులు పాల్గొన్నారు.



పూడిరాయిదొరువు వద్ద సముద్ర ముఖద్వారాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్

5న పెద్దశేష వాహనం

తిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన నాగులచవితి సందర్భంగా తిరుమలలో పెద్దశేష వాహనంపై మలయప్పస్వామి దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఉభయ దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో ఊరేగనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఆటోడ్రైవర్ దారుణ హత్య

● స్నేహితుడే కాలయముడైన వైనం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్నేహితుడే కాలయముడై ఆటోడ్రైవర్ నాగరాజు(28)ను దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారానికి చెందిన నాగరాజు ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం బహదూరుపేటకు చెందిన పద్మావతి గంగను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు శివనాథపురం పంచాయతీ పరిధిలో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. తిరుపతికి చెందిన రాజేష్ అదే ప్రాంతంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకునేవాడు. ఇద్దరు కలిసి మద్యం తాగుతూ తరచూ సెంట్రింగ్ పనులకు కూడా వెళ్లేవారు. రాజేష్ నాగరాజు కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ కారణంగా కొన్ని రోజులుగా నాగరాజు దంపతుల మధ్య విబేధాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. సర్ది చెప్పేందుకు రాజేష్ అక్కడికి వెళ్లాడు. ఇంతలో నాగరాజు రాజేష్ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన రాజేష్ బండరాయితో నాగరాజు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పద్మావతి గంగ తొట్టంబేడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న రాజేష్ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగరాజు మృతదేహం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.38 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 67,785 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 27,723 మంది తలనీలాలు సమర్పించారు.

కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గణపతి హోమంతో కార్తీకమాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజులు ప్రత్యేక హోమాది క్రతవులు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించి, అలంకరణ చేపట్టారు.

రూ.5.28 కోట్లతో రోడ్ల అభివృద్ధి: పాశం



రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులను రూ.5.28 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు మండలంలోని చెన్నూరు నుంచి తిప్పవరప్పాడు వరకు రోడ్డు మరమ్మతుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో సుమారు 60 కిలోమీటర్ల మేర రహదారుల్లోని గోతులను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.5.28 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మిషన్ పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా గూడూరు - రాజంపేట రహదారి మార్గంలో 6 కిలోమీటర్ల రహదారిని రూ.65 లక్షలతో అభివృద్ధి చేసే పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మట్టం శ్రావణి, పెంచలయ్య, దుద్దా రాఘవరెడ్డి, శివకుమార్, సురేష్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న తహసీల్దారు

డక్కిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని వెలికల్లు గ్రామ సర్వే నెంబరు 249-22లో 18 ఎకరాల ప్రభుత్వ మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించడంతో శనివారం తహసీల్దారు వెళ్లి అడ్డుకొన్నారు. ప్రభుత్వ భూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే తనకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకొంటామని చెప్పారు. తహసీల్దారు వెంట సర్వేయరు రాజగోపాల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



మహిళకు సభ్యత్వం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ నేత, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు పొక్కాలి బాలాజీశెట్టి, పొక్కాలి సుధాకర్‌శెట్టి ఆధ్వర్యంలో ఉత్తమనెల్లూరు, తాటిగుంట చెరువు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే కలిగే బీమా సౌకర్యం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తీగల సురేష్‌బాబు, కొనిశెట్టి రమేష్, కోటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పరసాకు టీడీపీ నేతల పరామర్శ



మాజీమంత్రి పరసా రత్నంతో టీడీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం గుండె ఆపరేషన్ చేసుకుని తిరుపతిలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం పెళ్లకూరు మండలంలోని పలువురు టీడీపీ నేతలు పరసాను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, కొత్తూరు సర్పంచు సంచి కృష్ణయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మునీష్, మురళీనాయుడు, సిద్దులయ్య నాయుడు తదితరులు ఉన్నారు

ఆస్పత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేత



అమీర్‌బీకి పింఛను అందజేస్తున్న రమ్య

గూడూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ వీరారెడ్డిపల్లికి చెందిన అమీర్‌బీ అనే వృద్ధురాలు అనారోగ్యంతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సచివాలయ అడ్మిన్ రమ్య శనివారం నెల్లూరుకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమీర్‌బీకి పింఛను అందజేశారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు రమ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు

తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. అండర్-14 విభాగంలో 11మంది బాలురు, అండర్-17 విభాగంలో బాలురు 13మంది, బాలికలు 15మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్ఎం మురళి తెలిపారు. మచిలీపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రెఫరీగా తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ సురేంద్రబాబు, పళని వ్యవహరించారు. విద్యార్థులను అధ్యాపకులు ప్రభాకర్, పూర్ణచంద్ర, వెంకటముని అభినందించారు.

ప్రమాదవశాత్తు షిఫ్ట్ ఆపరేటర్ మృతి



గోపీకృష్ణ మృతదేహం

గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక చవటపాళెం సమీపంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రెండోపట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కోవూరు గ్రామానికి చెందిన గోపీకృష్ణ(35) చవటపాళెం సమీపంలోని ఓ కర్మాగారంలోని కోర్‌షాపులో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ పరికరాలు గోపీకృష్ణ తలకు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న నేరాలు... హడలిపోతున్న ప్రజలు

గూడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా ఇటీవల హత్యలు, హత్యాయత్నాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రశాంతతకు మారు పేరుగా ఉన్న నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న నేరాలతో నియోజకవర్గ ప్రజలు హడలిపోతున్నారు. సెప్టెంబరు 10వ తేదీన చిల్లకూరు మండలం తొణుకుమాల గ్రామంలో ఓ తోట వద్ద కాపలాదారులుగా ఉన్న అంకయ్య, వెంకటేశ్వర్లు మధ్య నగదు విషయమై వివాదం తలెత్తింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లును అంకయ్య హత్యచేసి తెలుగుగంగ కాలువ సమీపంలో పూడ్చిపెట్టాడు. అదేవిధంగా గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామంలో సెప్టెంబరు 24వ తేదీన మనస్పర్థల కారణంగా రమేష్ అనే వ్యక్తి అత్త వరసైన ఆనందమ్మను నిద్రిస్తున్న సమయంలో కర్రతో కొట్టి హత్యచేశాడు. చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో లాసిక్ అనే 11 ఏళ్ల బాలుడిని వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన అనిల్ వరగలి గ్రామానికి చెందిన చరణ్ సాయంతో గత నెల 7వ తేదీ ఉప్పుటేరులో ముంచి చంపేశారు. చిల్లకూరు మండలం కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన మనోజ్ గత నెల 11వ తేదీన తల్లి సుశీలమ్మ మందలించడంతో కర్రతో కొట్టి హత్య చేశాడు. గత నెల 22వ తేదీన చిల్లకూరు మండలం నాంచారమ్మపేట గ్రామంలో టీడీపీ కార్యకర్త హరిప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాజకీయ కక్షల కారణంగా దారుణంగా దాడిచేసి హత్య చేశారు. గత నెల 31న చిల్లకూరు మండలం కడివేడు గ్రామానికి చెందిన వెంకటేష్‌ను పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం దారుణంగా దాడిచేసి హత్య చేశాడు. వాకాడు మండలం శ్రీనివాసపురం గిరిజనకాలనీలో నివాసముంటున్న చిన్నరామయ్యపై అతని కుమారుడు రమేష్‌కు మద్యం మత్తులో దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన గత నెల 31న చోటు చేసుకుంది. అదేవిధంగా అక్టోబరు 2వ తేదీ గూడూరులో జరిగిన జెండా ఉత్సవాల్లో డీజేల వద్ద తగాదాలలో ముగ్గురు యువకులు కత్తి పోట్లుకు గురైన విషయం తెలిసిందే. గత నెల 14వ తేదీన స్థానిక ఇందిరానగర్‌లో ఆస్తి విషయమై తలెత్తిన వివాదంలో కృష్ణారావు, ధనలక్ష్మి దంపతులపై వారి అల్లుడు సుబ్రహ్మణ్యం కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రశాంతంగా ఉండే గూడూరు నియోజకవర్గంలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నేరాల సంఖ్యను నియంత్రించడంతో పాటు నేర ప్రవృత్తి పెరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య

గూడూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీ వరిసాగులో సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. శనివారం స్థానిక రైతుసేవా కేంద్రంలో సిబ్బంది సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో పశువుల ఎరువు, పచ్చిరొట్ట అధికంగా వినియోగించడం వల్ల నేల సారవంతమై దిగుబడిలు అధికంగా వస్తాయన్నారు. విస్తరణ సిబ్బంది ఎప్పటికప్పుడు సాగులో సాంకేతిక అంశాలను తెలుసుకుని వాటిని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు వేణుగోపాలరావు, కార్తీక్, గోపి నాయక్, చెంచురెడ్డి, రమేష్, భవానీ, విజయలక్ష్మి, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సరైన డేటాను అప్‌లోడ్ చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ

గూడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెప్మా గ్రూపుల్లోని సభ్యులకు సంబంధించి సరైన డేటాను ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మెప్మా సైట్‌లో గ్రూపు సభ్యులు మారినా, బ్యాంకులు మారినా, ఇతర మార్పులు జరిగివున్నా ఇప్పటి వరకు సైట్‌లో ఎలాంటి మార్పులు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈయాప్‌లో కొత్తసభ్యుల డేటా, ఇతర వివరాలను కూడా నమోదు చేసుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, గోపి, కృష్ణవేణి, ప్రమీల, భాస్కర్, చందన, వసంత తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రమణకుమార్

గూడూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. శనివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం చేకూరి ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాతీయ హాకీ క్రీడాకారుడు భానుప్రకాష్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపాల్ రవిప్రసాద్, విశ్వక్సేనారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ భూముల వేలం



వేలంపాటలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామంలో వెలసిన్న శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. 19 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించగా రూ.1,50,100కు రైతులు లీజు హక్కులు దక్కించుకున్నట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం ముందుగా సమాచారం ఇవ్వకుండా దేవదాయశాఖ అధికారులు వేలంపాటలు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి.


ఓటు వేయలేదని పింఛను ఆపేశారు!



సదరం ధ్రువీకరణ పత్రం చూపుతున్న పోలయ్య

బాలయపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయలేదని పింఛను నిలిపివేశారని బాలయపల్లి గ్రామానికి చెందిన ఉల్లిపాయల పోలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం బాలయపల్లి సచివాలయం వద్దకు వచ్చిన ఆయన తాను 2010 నుంచి దివ్యాంగుల పింఛను పొందుతున్నానని తెలిపాడు. ఇందుకు సంబంధించిన సదరం ధృవీకరణ పత్రాన్ని మీడియాకు చూపించాడు. అధికార పార్టీకి చెందిన బాలయపల్లి సర్పంచు ఘట్టం అంజలి ఫిర్యాదుతో అధికారులు పింఛను ఇవ్వకుండా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి పింఛను ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఆలయాల్లో కార్తీక శోభ



నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక మాస శోభ సంతరించుకొంది. పట్టణంలోని నాగేశ్వరస్వామి, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుని ఆలయం, మన్నారుపోలూరులోని సంతానేశ్వరస్వామి, కల్యాణేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

గూడలిలో కార్తీకమాస పూజలు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి కామాక్షీదేవి సంఘమేశ్వర ఆలయంలో శనివారం కార్తీకమాస ప్రారంభపూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో సంఘమేశ్వరుడి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు జరిగాయి. అనంతరం సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన బండి చెంచయ్య కుటుంబానికి వైసీపీ నాయకులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. శనివారం మండలంలోని చిల్లకూరులోని ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసానికి చేరుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మీడియాతో మాట్లాడారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వడ్డిపాలెం గ్రామానికి చేరుకుని మృతుడి భార్య ప్రమీలమ్మకు రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలతో పేరం సమావేశం



ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గాలి భానుప్రకాశ్‌తో వెంకటతేజ

పెళ్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో నిర్వహించిన ఐటీ సినర్జీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలతో ప్రవాస భారతీయుడు, టీడీపీ యువనేత పేరం వెంకటతేజ సమావేశమయ్యారు. ఐటీ సినర్జీ కార్యక్రమానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ప్రత్యేక అతిథిలుగా హాజరయ్యారు అమెరికాలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న పేరం వెంకటతేజ శనివారం ఎమ్మెల్యేలను కలిసి పలు అంశాలను చర్చించారు.

ఉత్తమనెల్లూరులో గ్రామసభ



సభలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరులో శనివారం తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ల ఆధ్వర్యంలో భూముల రీసర్వేపై గ్రామసభ జరిగింది. పంచాయతీలోని పలు గ్రామాల రైతులు భూ సమస్యలపై 23 అర్జీలను ఇచ్చారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

కోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాధయ్య ఉద్యోగ విరమణ పొందారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో రాధయ్య దంపతులను షీల్డులు, జ్ఞాపికలతో సత్కరించారు.



రాధయ్య దంపతులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఫ్రీహోల్డ్ భూములపై సమగ్ర విచారణ

ఓజిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములపై సమగ్ర విచారణ జరుగుతోంది. గత వారం రోజులుగా వీఆర్వోలు ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2003కు ముందు అసైన్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ పట్టాదారుకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించారు. ఈ క్రమంలో ఓజిలి మండలంలోని 26పంచాయతీల పరిధిలో సుమారుగా 1275 ఎకరాలకు పైగా భూములు ఫ్రీ హోల్డ్ కింద మారాయని సమాచారం. సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లోని ఓజిలి మండలంలోనే ఎక్కువ భూములు ఫ్రీ హోల్డ్ కిందకు మారాయని తెలిసింది. ఇలా ఫ్రీహోల్డ్ అయిన భూములను లబ్ధిదారుల నుంచి కొందరు రాజకీయ నేతలు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణలో వీఆర్వోలు తలమునకలై ఉన్నారు. ఈ విషయమై తహసీల్దారు పద్మావతిని వివరణ అడగగా ఫ్రీ హోల్డ్ భూముల వివరాల సేకరణ జరుగుతోందని, మరో వారంలో పూర్తి వివరాలు సేకరించి సూళ్లూరుపేట ఆర్డీవోకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం కొండూరు, కాదలూరు ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతుల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుమారు 105 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు గుంతలమయమయ్యాయని, వాటిని మరమ్మతు చేసేందుకు రూ.4.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ పరమేశ్వరి, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, పార్థసారధి, సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోండి

చిల్లకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు, తిమ్మనగారిపాళెం, కమ్మవారిపాళెం, గుత్తావారిపాళెం గ్రామాల చెరువుల్లో వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు సమీపంలోని అపెక్స్ కంపెనీ నుంచి రబ్బర్ వ్యర్థాలతో పాటు కృష్ణపట్నం పోర్టు నుంచి కూడా వ్యర్థాలను తీసుకువచ్చి చెరువుల్లో వేస్తున్నారన్నారు. ఈ విషయమై సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 6న అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏటా నిర్వహించే అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవ ప్రచార పోస్టర్లను శనివారం షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ ఏడాది డిసెంబరు 6న సూళ్లూరుపేటలో 26వ వార్షికోత్సవ జ్యోతుల గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు కె.లీలా మోహన్‌రెడ్డి, కె.చంద్రమౌళిరెడ్డి, వీకే.రాజగోపాల్, సత్యనారాయణ, సుబ్బారావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చిల్లకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఊరేగించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పేద విద్యార్థికి చేయూత



విద్యార్థికి నగదు అందజేస్తున్న సీతారామ ధార్మిక సంస్థ ప్రతినిధులు

కోట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన పేద విద్యార్థి మహేష్‌కు కోట మండల పరిధిలోని విద్యానగర్‌లో శనివారం సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రూ.6వేల నగదు అందజేశారు. మహేష్ ఎంసీఏ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో సీతారామ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో దాతలు నందగోపాల్, శేషాద్రిశర్మ, వెంకటేష్ దాతృత్వంతో రూ.6వేల నగదు అందజేశారు.